

తీరిన మూడు తరాల రైతుల కష్టాలు

వివరాలు 3 లో

RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM

**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7 5 6 9 6 7 7 1 7 0

ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :232 | సంపాదకులు: కలిచేటి వెంకయ్య | శనివారం 18 జులై 2026 | పేజీలు: 8 | వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad

# రాష్ట్రాభివృద్ధిలో బ్యాంకులు భాగస్వామ్యం కావాలి





- -రుణ వితరణ కార్యక్రమంతో వ్యాపారవేత్తలుగా సామాన్యులు
- -సంక్షోభంలో ఉన్న రాష్ట్రానికి నిర్మలాసీతారామన్ సహకారం
- -కూటమి వచ్చాక రుణాల రీ- షెడ్యూల్‌తో రూ.1538 కోట్లు ఆదా
- -నరసరావుపేట రుణ వితరణ మేళాలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- -వివిధ వర్గాలకు రూ.3,216 కోట్లు పంపిణీ చేసిన సీఎం, కేంద్ర మంత్రి

**నరసరావుపేట, సింధూరదర్శిని:**
ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో బ్యాంకులు భాగస్వామ్యం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ప్రజల వద్దకే వెళ్లి రుణాలు అందించటం గర్వకారణమని, బ్యాంకులు రుణాలిచ్చే సంస్థలే కాదని రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములన్నారు. రైతు భవిష్యత్తు మార్చడానికి, యువత కలలు నెరవేర్చడానికి, పారిశ్రామికవేత్తల లక్ష్యం నెరవేరడానికి రుణాలు ఎంతో ఉపయోగపడతాయని వ్యాఖ్యానించారు. గత వైసీపీ పాలనంతా సమస్యల సుడిగుండమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి రాష్ట్రానికి తిప్పలు తెచ్చిందని, కూటమి అధికారంలోకి వచ్చాకే ఆ రుణాల్ని కేంద్ర సహకారంతో రీ -షెడ్యూలు చేసి రూ. 1,538 కోట్లు ఆదా చేశామని అన్నారు. పలనాడు జిల్లా నరసరావుపేటలో కేంద్ర ఆర్థికశాఖ, ప్రభుత్వ రంగ బ్యాంకులు మిగతా 2లో...




## భారత్‌లో సరికొత్త శకం..

### తొలి హైడ్రోజన్ రైలును ప్రారంభించిన ప్రధాని మోదీ

- హర్యానాలో తొలి హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ రైలుకు పచ్చజెండా ఊపిన ప్రధాని
- జింద్-సోనిపట్ మధ్య పరుగులు పెట్టనున్న హైడ్రోజన్ రైలు
- హర్యానాలో రూ.12,470 కోట్లకు పైగా విలువైన జాతీయ రహదారుల ప్రాజెక్టులకు శ్రీకారం
- ఢిల్లీ-కత్రా మధ్య ప్రయాణ సమయాన్ని 14 నుంచి 6 గంటలకు ద తగ్గించనున్న కొత్త ఎక్స్‌ప్రెస్‌వే
- కురుక్షేత్రలో ఎలివేటెడ్ రైల్వే ట్రాక్, కొత్త మెడికల్ కాలేజీలను జాతికి అంకితం



హర్యానా:స్వచ్ఛ ఇంధన రవాణా రంగంలో భారతీయ రైల్వే చారిత్రక ముందడుగు వేసింది. దేశంలోనే తొలిహైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ రైలును ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం హర్యానాలో జెండా ఊపి ప్రారంభించారు. పూర్తిగా స్వదేశీ మిగతా 2లో...



## ఏపీలో పెరుగుతున్న కరోనా.. అలర్ట్ అయిన ప్రభుత్వం

- దేశ వ్యాప్తంగా పెరుగుతున్న కరోనా కేసులు
- ఏపీలో ఇప్పటి వరకు 13కి పైగా కేసుల నమోదు
- ఇప్పటికే నలుగురు కోవిడ్ పేషెంట్ల మృతి

**అమరావతి, సింధూరదర్శిని:**
దేశంలో మరోసారి కరోనా కేసులు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. దేశ వ్యాప్తంగా జులై 1 నుంచి 340కి పైగా కేసులు నమోదయ్యాయి. ఏపీలో కూడా కేసుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. గడిచిన 20 రోజుల్లోనే రాష్ట్రంలో 13కి పైగా కేసులు నమోదయ్యాయి. కడప జిల్లాలో అత్యధికంగా 8 కేసులు నమోదు కాగా, గుంటూరులో 3, విశాఖలో 1, మిగతా 2లో...

## ఇప్పుడు అలా కుదరదు..

### స్థానిక ఎన్నికలపై నాదెండ్ల మనోహర్ కీలక వ్యాఖ్యలు!

- స్థానిక ఎన్నికల్లో పాత ఫార్ములా వర్తించదన్న నాదెండ్ల మనోహర్
- పార్టీ బలాబలాలను బట్టి స్థానిక ఎన్నికల్లో పోటీ ఉంటుందని స్పష్టీకరణ
- సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రయోజనాల కోసమే వెనక్కి తగ్గామన్న వ్యాఖ్య
- జనసైనికుల సమస్యల పరిష్కారానికి 'చర్చావేదిక' ప్రారంభం
- వైసీపీ విధ్వంస రాజకీయాలు చేస్తోందని, దుష్ప్రచారం చేస్తోందని ఆరోపణ

**అమరావతి, సింధూరదర్శిని:**
ఏపీలో సార్వత్రిక ఎన్నికల వేడి చల్లారకముందే స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. ఇప్పటికే సీఎం చంద్రబాబు స్థానిక ఎన్నికలపై పలు సందర్భాల్లో సంకేతాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో, సెప్టెంబర్‌లో ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్న ప్రచారంతో ప్రధాన పార్టీలు క్షేత్రస్థాయిలో వ్యూహరచనకు పదును పెడుతున్నాయి. ఈ క్రమంలో అధికారంలో ఉన్న టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిలోనూ స్థానిక ఎన్నికల పొత్తులు, సీట్ల పంపకాలపై చర్చ ఊపందుకుంది. సార్వత్రిక ఎన్నికల్లో అనుసరించిన ఫార్ములా స్థానిక ఎన్నికలకు వర్తించదని, పార్టీ బలాబలాల ఆధారంగానే పోటీ ఉంటుందని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో



ఉంచుకునే 2024 సార్వత్రిక ఎన్నికల్లో తమ అధినేత పవన్ కల్యాణ్ పొత్తు నిర్ణయం తీసుకున్నారని మనోహర్ గుర్తుచేశారు. అప్పటి పరిస్థితులకు అనుగుణంగా, వైసీపీ వ్యతిరేక ఓటు చీల కూడదనే లక్ష్యంతో జనసేన కొన్ని సీట్లలో మిగతా 2లో...

## కోడికత్తి శ్రీనుకు ఒక న్యాయం.. సీదిరి అప్పలరాజు కొడుక్కి ఒక న్యాయమా?: అనిత

**అమరావతి, సింధూరదర్శిని:**
కోడికత్తి శ్రీనుకు ఒక న్యాయం.. మాజీ మంత్రి కొడుక్కి ఒక న్యాయమా? అని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రశ్నించారు. గురువారం విజయనగరంలో మీడియాతో మాట్లాడుతూ, పలాస ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందని తెలిపారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు తన కొడుకును రక్షించుకోవడానికి పడిన తపన.. ప్రమాదంలో తీవ్ర గాయాలు పాలైన వ్యక్తిని ఆసుపత్రికి తీసుకువెళ్లడంలో



చూపలేదన్నారు.
"ఆరవ్ వర్మ పిల్లోడన్నారు.. మరి కోడి కత్తి శ్రీను వయస్సు ఆనాటికి ఎంత? కోడి కత్తి శ్రీనును జైల్లో ఎన్ని రోజులు పెట్టారు. అప్పుడు పాపం పిల్లోడు అని అనిపించలేదా?" అని అనిత ప్రశ్నించారు. బాధితులను పరామర్శించేందుకు మంత్రి నారా లోకేశ్ వెళ్లినప్పుడు కనీసం ఫొటో కూడా దిగరని... అదే జగన్ వస్తే ఊరేగింపులు, బలప్రదర్శనలు.. జై కొట్టటం ఏంటని మండిపడ్డారు. జగన్ ప్రభుత్వం మిగతా 2లో...

## వర్జీనియా పొగాకు కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు మరింత గిట్టుబాటు ధర కల్పించాలి

- కంపెనీలతో చర్చించి ధరలు పెరిగేలా టోబాకో బోర్డు చర్యలు తీసుకోవాలి
- 2026-27లో ఉత్పత్తిని సుమారు 81 మిలియన్ కిలోలకు పరిమితం చేసేలా రైతులకు అవగాహన కల్పిస్తాం
- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**అమరావతి, సింధూరదర్శిని:**రాష్ట్రంలో వర్జీనియా పొగాకు కొనుగోళ్లను మరింత వేగవంతం చేసి రైతులకు గిట్టుబాటు ధర లభించేలా అన్ని చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు టోబాకో బోర్డును కోరారు. శుక్రవారం పొగాకు కొనుగోళ్ల పురోగతిపై మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర



విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, టొబాకో బోర్డు ఛైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్, టొబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి. విశ్వశ్రీ, వ్యవసాయ శాఖ డైరెక్టర్ మంజీర్ జిలానీ సమూన్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో ప్రస్తుతం మిగతా 2లో...

## భారత్‌లో సరికొత్త శకం.. తొలి హైడ్రోజన్ రైలును ప్రారంభించిన ప్రధాని మోదీ

(మొదటిపేజీ తరువాయి)

పరి జ్ఞానంతో రూపుదిద్దుకున్న ఈ రైలు, తన ప్రయా ణానికి అవసరమైన విద్యుత్‌ను హైడ్రోజన్‌ను ఉపయోగించి స్వయంగా ఉత్పత్తి చేసుకుంటుంది. కేవలం నీటి ఆవిరిని మాత్రమే విడుదల చేస్తూ పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తుంది. ఈ 10 కోచ్‌ల రైలు హర్యానాలోని జింద్, సోనిపట్ మధ్య 90 కిలోమీటర్ల దూరాన్ని కేవలం రెండు గంటల్లో పూర్తి చేస్తుంది. 3,200 హార్స్‌పవర్ సామర్థ్యంతో పనిచేసే ఈ రైలు, ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన హైడ్రోజన్ రైళ్లలో ఒకటిగా నిలిచింది. ఈ ఘనతతో హైడ్రోజన్ రైళ్లను నడుపుతున్న అతికొద్ది దేశాల సరసన భారత్ చేరింది.

**రూ.12,470 కోట్లతో రహదారుల అభివృద్ధి**

ఈకార్యక్రమంతో పాటు హర్యానాలో రూ.12,470 కోట్లకు పైగా విలువైన పలు జాతీయ రహదారుల ప్రాజెక్టులను ప్రధాని మోదీ జాతికి అంకితం చేసి, మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా సుమారు రూ.9,680 కోట్ల వ్యయంతో నిర్మించిన 158 కిలోమీటర్ల పొడవైన ఢిల్లీ–అమృత్‌సర్–కత్రాఎక్స్‌ప్రెస్‌వేను ప్రారంభిం చారు. ఈగ్రీన్‌ఫీల్డ్ కారిడార్ వల్ల ఢిల్లీ–కత్రా ప్రయాణ సమయం 14 గంటల నుంచి 6 గంటలకు, ఢిల్లీ–అమృత్‌సర్ ప్రయాణ సమయం 8 నుంచి 4 గంటలకు తగ్గనుంది. ఇది వైష్ణోదేవి యాత్రికులకు, పర్యాటకులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. అదేవిధంగా అంబాలా–కాలా అంబ్, జింద్–గోహానా జాతీయ రహదారులను కూడా జాతికి అంకితం చేశారు. జింద్–గోహానా రహదారి వల్ల ప్రయాణ సమయం రెండు గంటల నుంచి 40 నిమిషాలకు తగ్గనుంది. హన్సీ–బరవాలా రహదారి విస్తరణ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు.

**వైద్యం, మౌలిక సదుపాయాలకు పెద్దపీట**

కురుక్షేత్ర నగరంలో రైల్వే క్రాసింగ్‌ల వద్ద ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు నిర్మించిన ఎలివేటెడ్ రైల్వే ట్రాక్‌ను కూడా ప్రధాని ప్రారంభించారు. ఇది రైలు, రోడ్డు రవాణా వ్యవస్థల సామర్థ్యాన్ని పెంచుతుంది. రాష్ట్ర ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేసే దిశగా భివానీలోని పండిట్ నేకీ రామ్ శర్మ ప్రభుత్వ వైద్య కళాశాల, నార్నౌల్‌లోని మహర్షి చ్యవన్ మెడికల్ కాలేజీ, రావు తులారామ్ ఆసుపత్రిని జాతికి అంకితం చేశారు. ఈ సంస్థల ద్వారా హర్యానాలో వైద్య విద్య, ఆరోగ్య సేవలు మరింత అందుబాటులోకి రానున్నాయి. వీటితో పాటు సిక్కు గురువుల చరిత్ర, వారి త్యాగాలు, దేశ సంస్కృతికి వారు అందించిన సేవలను ఆధునిక టెక్నాలజీతో ప్రదర్శించేందుకు కురుక్షేత్రలో నిర్మించనున్న సిక్కు మ్యూజియానికి ప్రధాని శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులన్నీ హర్యానా సమగ్రాభివృద్ధికి దోహదం చేస్తాయని ప్రభుత్వం పేర్కొంది.

## ఏపీలో పెరుగుతున్న కరోనా.. అలర్ట్ అయిన ప్రభుత్వం

(మొదటిపేజీ తరువాయి)

కాకినాడలో 1 కేసు నమోదైంది. మహమ్మారి కారణంగా ఇప్పటికే రాష్ట్రంలో నలుగురు మృతి చెందారు. హోం ఐసోలేషన్‌లో మరో ముగ్గురు ఉన్నారు. ఆసుపత్రిలో ఇద్దరు కోవిడ్ పేషెంట్లకు చికిత్స అందుతోంది. కృష్ణా జిల్లాకు చెందిన మరో మహిళ కరోనా బారిన పడగా ఆమెకు ఎయిమ్స్‌లో చికిత్స అందిస్తున్నారు. జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం కరోనా బారినపడిన పేషెంట్ల శాంపిల్స్‌ను పూణేలోని ల్యాబ్‌కు పంపించారు. కేసులు ఎక్కువగా వస్తుండటంతో ప్రభుత్వం అలర్ట్ అయింది. అధికారులను అప్రమత్తం చేసింది. ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, టెస్టులు అందుబాటులో ఉంచాలని సీఎం చంద్రబాబు ఆదేశాలిచ్చారు. కరోనా కేసులపై నేడు మధ్యాహ్నం తర్వాత ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించే అవకాశం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మాస్కులు ధరించాలని, గుంపులు కట్టకుండా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. కరోనా నివారణ చర్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

## ఇప్పుడు అలా కుదరదు.. స్థానిక ఎన్నికలపై నాదెండ్ల మనోహర్ కీలక వ్యాఖ్యలు!

(మొదటిపేజీ తరువాయి)

సర్దుకుపోయిందని, నాలుగు అడుగులు వెనక్కి తగ్గిందని అన్నారు. అయితే, ఆ త్యాగాన్ని స్థానిక ఎన్నికల్లోనూ ఆశిస్తే పొరపాటేనని ఆయన స్పష్టం చేశారు. “సార్వత్రిక ఎన్నికల ఫార్ములానే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఉంటుందనడం సరికాదు. స్థానిక పరిస్థితులు, పార్టీ బలం ఆధారంగానే మా పోటీ ఉంటుంది. పొత్తు ధర్మాన్ని పాటిస్తూనే, జనసేన బలంగా ఉన్నచోట కచ్చితంగా పోటీ చేస్తుంది” అని ఆయన పేర్కొన్నారు. త్వరలో జరగబోయే ఎన్డీయే కూటమి సమావేశంలో ఈ విషయంపై తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. పార్టీ బలోపేతం, కార్యకర్తలకు అవకాశాలు కల్పించడంపై కూడా జనసేన దృష్టి సారించింది. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న వారికి స్థానిక ఎన్నికల్లో తప్పకుండా అవకాశం కల్పిస్తామని మనోహర్ భరోసా ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే జనసైనికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేసేందుకు ‘జనసేన పార్టీ చర్చావేదిక’ అనే కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనిని రాష్ట్రంలో తొలిసారిగా కైకలూరు నుంచి మొదలుపెట్టినట్లు ఆయన ప్రకటించారు. ఈ వేదిక ద్వారా గ్రామస్థాయిలో కార్యకర్తల ఇబ్బందులను తెలుసుకోవడంతో పాటు వైసీపీ సోషల్ మీడియా ద్వారా చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొడతామని వివరించారు. కూటమిగా కలిసి పనిచేస్తున్నప్పుడు చిన్న చిన్న సమస్యలు, అభిప్రాయ భేదాలు సహజమని, వాటిని సర్దుకుని ముందుకు సాగాలని జనసైనికులకు ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో వైసీపీ విధ్వంసం సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా కూటమిలోని అన్ని పార్టీల శ్రేణులు అంకితభావంతో కలిసికట్టుగా పనిచేసి, ప్రభుత్వానికి అండగా నిలవాలని మనోహర్ సూచించారు. మొత్తం మీద స్థానిక ఎన్నికల్లో జనసేన మరింత కీలక పాత్ర పోషించాలని భావిస్తోందని, సీట్ల పంపకాల్లో గట్టిగా బేరమాడేందుకు సిద్ధమవుతోందని మనోహర్ వ్యాఖ్యల ద్వారా స్పష్టమవుతోంది.

## వర్జీనియా పొగాకు కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు మరింత గిట్టుబాటు ధర కల్పించాలి

(మొదటిపేజీ తరువాయి)

హయాంలో ఒక్క మత్స్యకారుడికైనా న్యాయం జరిగిందా? అని ఆమె నిలదీశారు.“బోటు గల్లంతైన విషయం తెలిసిన వెంటనే ప్రభుత్వం స్పందించి నేవీ అధికారులను అప్రమత్తం చేసింది. అప్పటికప్పుడు కాకినాడ నుంచి ప్రత్యేక మెరైన్ బోటును తెప్పించి గాలింపు చేపట్టాం. రెండు నేవీ హెలికాప్టర్లతో 72 గంటలపాటు సముద్రాన్ని జల్లెడపట్టాం. మత్స్యకారుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ప్రభుత్వం అందజేసింది” అని వివరించారు. 45 రోజుల్లో ప్రధాని మోదీ చేతుల మీదుగా భోగాపురం విమానాశ్రయం ప్రారంభం అవుతుందని మంత్రి తెలిపారు.






# రాష్ట్రాభివృద్ధిలో బ్యాంకులు భాగస్వామ్యం కావాలి

(మొదటిపేజీ తరువాయి)

సంయుక్తంగా నిర్వహించిన మెగా రుణమేళా కార్యక్రమానికి (క్రెడిట్ అవుట్ రీచ్) కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు. పలనాడు జిల్లాలో 1,03,246 మంది లబ్ధిదారులకు రూ.3,216 కోట్ల రుణాలను అందజేశారు. ఇందులో భాగంగా 15 వేల మంది డ్వాక్రా మహిళలకు,13,355 మంది పారిశ్రామికవేత్తలకు రుణాలు పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ “పారిశ్రామికవేత్తలుగా మారడానికి పల్నాడు చిరునామా కావాలి. పలనాడు పౌరుషానికి శక్తివంతమైన ఆయుధం ఇస్తున్నాం. క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమం నిర్వహిస్తున్న అందరికీ అభినందనలు. రైతులు, విద్యార్థులు, డ్వాక్రా సంఘాల మహిళలు ఇలా అర్హులైన వారందరికీ రుణం అందించటమే లక్ష్యం. మహిళా సాధికారతకు ఈ క్రెడిట్ అవుట్ రీచ్ ద్వారా ప్రయోజనాలు చేకూరతాయి. రెండేళ్ల క్రితం రాష్ట్రం అంతా సమస్యల సుడిగుండంలో ఉంది. ఏపీలో ఆర్థిక విధ్వంసం చేశారు. కేంద్ర సహకారంతో అమరావతి, పోలవరం, విశాఖ ఉక్కు ఆకాంక్షలు నెరవేరాయి. వీబీజీ రామ్ జీ కింద కేంద్రం నుంచి రూ.7,707 కోట్లు రాష్ట్రానికి వస్తుంది. రాయలసీమను హార్టీ కల్చర్ హబ్ గా మార్చేందుకు కేంద్రం రూ.40 వేల కోట్లు ఆర్థిక సహకారం అందిస్తుంది.ప్రైవేటు పెట్టుబడులతో కలిపి ఈ ప్రాంతాన్ని ఉద్యాన హబ్ గా మారుస్తాం.” అని సీఎం వివరించారు.

**నిర్మలా సీతా రామన్ సంస్కరణల వాది**

“మహిళలందరికీ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదర్శంగా నిలుస్తున్నారు. 10 లక్షల డ్వాక్రా సంఘాలు రూ.29 వేల కోట్ల పొదుపుతో దేశంలోనే మేటిగా నిలిచాయి. రుణాల రీ పేమెంట్ లో 99.5 శాతంతో డ్వాక్రా మహిళలు అగ్రస్థానంలో ఉన్నారు. వారందరినీ మహిళా వ్యాపారవేత్తలుగా మార్చేందుకు వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమం చేపట్టాం. బ్యాంకింగ్ లో నిర్మలా సీతా రామన్ చాలా సంస్కరణలు తీసుకొచ్చారు. నష్టాల్లో ఉన్న చిన్న బ్యాంకులను విలీనం చేసి సమర్థ బ్యాంకింగ్ వ్యవస్థకు దోహదం చేశారు. డిజిటల్ బ్యాంకింగ్ విప్లవం, జన్ ధన్ యోజన ద్వారా



కోట్లాది బ్యాంకు ఖాతాలు, జీఎస్టీ శ్లాబ్ లను కుదించి పారదర్శక విధానం తెచ్చారు. వికసిత్ భారత్ 2047కు అనుగుణంగా చాలా సంస్కరణలు కేంద్ర మంత్రి నిర్మల తీసుకొచ్చారు. ఈ తరహా క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమాల్ని 6 జిల్లాల్లో నిర్వహించేందుకు తక్షణమే అంగీకరించారు. త్వరలోనే 3 నెలలకు ఒకటి చొప్పున ఈ తరహా కార్యక్రమాలు చేపడతాం.” అని ముఖ్యమంత్రి అన్నారు

**చిన్న వ్యాపారులకు అండగా కేంద్రం-కేంద్ర మంత్రి**

దేశంలోని ప్రతి గ్రామంలోనూ బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉండాలన్నదే ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పమని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. తాను ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టే సమయానికి బ్యాంకులు ఎన్‌పీఏల సమస్యలతో ఇబ్బందుల్లో ఉండేవని, చిన్న వ్యాపారులు అప్పులు దొరక్క నష్టపోయేవారని గుర్తుచేశారు. చిన్న వ్యాపారుల ఆర్థిక కష్టాలను గుర్తించిన ప్రధాని మోదీ.. ప్రభుత్వమే గ్యారెంటీ ఇచ్చి బ్యాంకుల ద్వారా వారికి సులభంగా రుణాలు అందేలా పథకాలు తెచ్చారని వివరించారు. నేడు బ్యాంకులు స్వయంగా వ్యాపారుల చెంతకే వచ్చి రుణాలు ఇస్తున్నాయని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. మెగా రుణమేళాలో భాగంగా లబ్దిదారులకు ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి రుణ మంజూరు పత్రాలను, చెక్కులను అందజేశారు.

**ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ అందజేత**

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.42.16 లక్షల విలువైన అంబులెన్స్‌ను పిడుగురాళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి అందించారు. అలాగే నాబార్డు సౌజన్యంతో డీసీసీబీ (ఐజజదీ) కి రూ.25 లక్షల విలువైన 2 మొబైల్ డెమో వ్యాన్లు అందించారు. అలాగే విద్యార్థినులకు రూ.17.80 లక్షల విలువైన 301 సైకిళ్లను పంపిణీ చేశారు. పర్యాటక శాఖకు గ్రామీణ బ్యాంక్ తరపున రూ.14 లక్షల విలువైన 2 బ్యాటరీ వాహనాలను అందించారు. వీటిని సీఎం చంద్రబాబు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం దివ్యాంగులకు ఉచితంగా ట్రై సైకిళ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, స్థానిక ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, భాష్యం రామకృష్ణ, పలువురు ఎమ్మెల్యేలు, బ్యాంక్ అధికారులు, పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు. సభకు ముందు సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ అక్కడ ఏర్పాటు చేసిన ప్రభుత్వ స్టాళ్లను సందర్శించి, నిర్వాహకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

# కేరళను చూసి నేర్చుకోవాలి: ఉచిత పథకాలపై అయ్యన్నపాత్రుడు ఆసక్తికర వ్యాఖ్యలు

-మన రాష్ట్ర ప్రజలు ఉచిత పథకాలపై ఎక్కువ దృష్టి పెడుతున్నారన్న అయ్యన్న

-రాష్ట్ర అభివృద్ధిలో కూడా తమవంతు బాధ్యత తీసుకోవాలని సూచన

-అందరూ ఒక చెట్టు నాటితే రాష్ట్రం పచ్చదనంతో కళకళలాడుతుందని వ్యాఖ్య

అమరావతి, సింధూరదర్శిని: రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్నందున తన నోటికి ప్లాస్టర్ వేసినట్లుగా ఉందని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారు. ఉచిత పథకాలపై మాట్లాడిన ఆయన, ప్రజలు కేవలం సంక్షేమ పథకాలపైనే ఆధారపడకుండా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. రాష్ట్రాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. కేరళ ప్రజలను ఉదాహరణగా ప్రస్తావిస్తూ, అక్కడ ప్రజలు అభివృద్ధిలో చురుకుగా పాల్గొంటారని, కానీ మన రాష్ట్రంలో మాత్రం ఉచిత పథకాలు ఏమి వస్తాయనే దానిపైనే ఎక్కువగా దృష్టి పెడుతున్నారని అన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ అంశంపై కూడా స్పీకర్ స్పందించారు. కేరళలో ప్రజలు పెద్దఎత్తున మొక్కలు నాటుతారని, మన రాష్ట్రంలో కూడా ప్రతి ఒక్కరూ కనీసం ఒక చెట్టైనా నాటాలని పిలుపునిచ్చారు. అయితే ఇక్కడ మొక్కలు నాటడం కంటే చెట్లను నరికివేయడంపైనే ఎక్కువ దృష్టి కనిపిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి వ్యక్తి ఒక మొక్క నాటితే రాష్ట్రం మొత్తం పచ్చదనంతో కళకళలాడుతుందని అన్నారు.

రాజకీయాలపై కూడా అయ్యన్నపాత్రుడు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎప్పుడూ రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శలే జరుగుతున్నాయని, అభివృద్ధి అంశాలపై చర్చలు తక్కువగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాల్సిన సమయం వచ్చిందని అభిప్రాయపడ్డారు.

# వర్జీనియా పొగాకు కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు మరింత గిట్టుబాటు ధర కల్పించాలి

(మొదటిపేజీ తరువాయి)

జరుగుతున్న ఎఫ్‌సీవీ పొగాకు కొనుగోళ్లు, రైతులకు లభిస్తున్న ధరలు, మార్కెట్ పరిస్థితులు, కొనుగోళ్ల వేగవంతంపై విస్తృతంగా సమీక్షించారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, గత నాలుగు రోజులుగా పొగాకు కొనుగోళ్లు గణనీయంగా ఊపందుకున్నాయని, ప్రస్తుతం రోజుకు సుమారు 8.5 లక్షల కిలోల పొగాకును కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం గరిష్ఠంగా కిలోకు రూ.250 వరకు ధర లభిస్తోందని, రైతులకు మరింత మెరుగైన ధర వచ్చేలా కొనుగోలు సంస్థలతో సమన్వయం చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని టొబాకో బోర్డును కోరారు. ముఖ్యంగా, పొగాకు కొనుగోలు సంస్థలపై సమర్థవంతమైన ఒత్తిడి తీసుకువచ్చి రైతులకు ఇంకా అధిక ధర లభించేలా చర్యలు చేపట్టాలని టొబాకో బోర్డు చైర్మన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కు సూచించారు.

కొనుగోళ్లు మరింత వేగవంతం కావడం వల్ల రైతులకు గిట్టుబాటు ధరలు లభించే అవకాశాలు మరింత మెరుగుపడతాయని మంత్రి పేర్కొన్నారు. అలాగే, తక్కువ నాణ్యత గల పొగాకును సాగు చేసిన రైతులు కూడా నష్టపోకుండా వారికి గిట్టుబాటు ధర లభించేలా కొనుగోలు సంస్థలతో ప్రత్యేకంగా చర్చలు జరపాలని టొబాకో బోర్డు అధికారులకు మంత్రి ఆదేశించారు.

భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని 2026-27 సీజన్‌లో ఎఫ్‌సీవీ పొగాకు ఉత్పత్తిని సుమారు 81 మిలియన్ కిలోలకు పరిమితం చేసే దిశగా వ్యవసాయ శాఖ, టోబాకో బోర్డుతో సమన్వయం చేసుకుని రైతులకు విస్తృత అవగాహన కల్పిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తిని నియంత్రించడం ద్వారా రైతులకు స్థిరమైన గిట్టుబాటు ధరలు లభించేలా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి

## జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



నెల్లూరు (సింధూర దర్శిని) 17 జూలై నెల్లూరు జిల్లా; ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషిచేస్తున్నామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో డీఆర్వో విజయ్ కుమార్‌తో కలిసి ఉద్యోగుల గ్రీవెన్స్ ను కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను సమర్పించారు. ఉద్యోగుల సమస్యలను ఓపికగా ఆలకించిన కలెక్టర్, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ గ్రీవెన్స్ లో అందిన ప్రతి అర్జీని పరిశీలించి, సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.


# ప్రైవేట్ బస్సు డ్రైవర్లకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలి

## ఏ.ఐ.ఆర్.టి.డి.డబ్ల్యు.ఎఫ్



గూడూరు( సింధూర దర్శిని ) 17 జూలై నెల్లూరు జిల్లా ; కనీస వేతన చట్టాన్ని ప్రైవేటు స్కూల్,కాలేజి బస్సు డ్రైవర్లకు, అమలు చేయాలని శుక్రవారం గూడూరు పట్టణంలోని ఆదిశంకర ఇంజనీరింగ్ కాలేజీలో బస్సు డ్రైవర్లు కి ఏర్పాటుచేసిన సమావేశంలో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (సి.ఐ.టి.యు) అనుబంధం జిల్లా కార్యదర్శి కె.సురేష్ తెలియజేశారు. నెల్లూరు జిల్లాలో దాదాపుగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న డ్రైవర్లు సుమారు వెయ్యి మందికి పైగా ఉన్నారని, వీళ్లకు నెలకు పదివేల నుండి 18 వేల లోపల జీతం తీసుకునే కార్మికులు ఉన్నారని, వీళ్లకు ఎటువంటి కార్మిక హక్కులు లేవని, పి.ఎఫ్,ఇ.ఎస్.ఐ సౌకర్యాలు లేవని, వేతనంతో కూడిన సెలవులు, విశ్రాంతి గదులు,మధ్యాహ్నం భోజన సదుపాయాలు లేవని, సదుపాయాలన్నీ కల్పించడానికి మరియు ప్రతి ఒక్క డ్రైవర్ కు కనీస వేతనం రూ.26,000/- ఇవ్వాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని, ఆయన డిమాండ్ చేశారు. గూడూరు సి.ఐ.టి.యు కార్యదర్శి మాట్లాడుతూ డ్రైవర్ కు నెలకు కనీసం ఒక సెలవు ఇవ్వాలని,డ్రైవర్ల పిల్లలకు ఆ స్కూలు మరియు కాలేజీ నందు ఒకరికి ఉచిత విద్య అందజేయాలని, ఉదయం నుండి సాయంత్రం వరకు స్కూలు,కాలేజి, దగ్గర ఉండే డ్రైవర్లకు మధ్యాహ్న భోజనం మరియు విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని, విద్యాసంస్థలలో ఎక్కువ బస్సులు కలిగినటువంటి యాజమాన్యం అదనంగా ఇద్దరు డ్రైవర్లును ఏర్పాటు చేయాలని, డ్రైవర్లకు రెండు జతలు యూనిఫారం ఇవ్వాలని, ప్రతినెల 1వ తేదీ జీతం ఇవ్వాలని పలు డిమాండ్లపై ఈనెల 30వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగు ధర్నా కార్యక్రమంలో డ్రైవర్లు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

# డయల్ యువర్ యస్.పి కార్యక్రమం నిర్వహణ



నెల్లూరు( సింధూర దర్శిని) 17 జూలై నెల్లూరు జిల్లా; జిల్లా పోలీసు సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా యస్.పి.డా. అజిత వెజెండ్ల 'డయల్ యువర్ యస్.పి. కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ కార్యాలయం నందు శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ప్రతి శుక్రవారం జరిగే ఈ కార్యక్రమం ద్వారా సిబ్బంది నేరుగా ఫోన్ ద్వారా తమ సమస్యలను యస్.పి. కి తెలియజేసే అవకాశం కల్పించబడింది. ఈ కార్యక్రమంలో 12 మంది పోలీసు సిబ్బంది ఫోన్ ద్వారా తమ సమస్యలను తెలియజేశారు. అందులో ముఖ్యముగా వారి బదిలీలు, సస్పెన్షన్ రివోక్ మరియు ఇతర పరిపాలనా అంశాల సంబందించిన అభ్యర్థనలు. జిల్లా ఎస్పీ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రోగ్రాం నందు జిల్లా ఎసి. పి తో సావిత్రమ్మ మరియు డీపీవో విభాగాల సూపరింటెండెంట్ సురేష్, శిరీష మరియు మస్తాన్ రావు , ఎస్ బి 2 శ్రీనివాస రెడ్డి , పి జి ఆర్ ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



# తీరిన మూడు తరాల రైతుల కష్టాలు

## రాజముద్రతో 322 పాసు పుస్తకాల పంపిణీ

## పోతిరెడ్డిపాళెంలో రూ.36 లక్షలతో విలేజ్ హెల్త్ సెంటర్ ప్రారంభం

## ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

కోవూరు( సింధూర దర్శిని) 17 జూలై నెల్లూరు జిల్లా ; రైతు భూమికి సంపూర్ణ భద్రత కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, అందుకే రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను రైతులకు అందజేస్తున్నామని కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. శుక్రవారం కోవూరు మండలం పోతిరెడ్డిపాళెంలో రూ.36 లక్షల వ్యయంతో నిర్మించిన విలేజ్ హెల్త్ సెంటర్‌ని ప్రారంభించి, అనంతరం 322 మంది రైతులకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ పోతిరెడ్డిపాళెంలో మూడు తరాలుగా కొందరు రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు లేక ఇబ్బందులు పడటం బాధాకరమన్నారు. డెల్టా ప్రాంతంలో, నెల్లూరుకు సమీపంలో ఉన్న గ్రామంలో ఇలాంటి సమస్యలు ఇన్నేళ్లుగా కొనసాగినా గత ప్రభుత్వాలు, అధికారులు పట్టించుకోకపోవడం విచారకరమని అన్నారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందించేందుకు సహకరించిన మంత్రి అనగాని సత్యప్రసాద్ కి, రైతుల హక్కులను కాపాడుతున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా సుమారు 140 మంది రైతుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



### ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతో రైతులకు భరోసా

గత ప్రభుత్వం తీసుకొచ్చిన వివాదాస్పద ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రైతుల్లో తీవ్ర ఆందోళన కలిగించిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ చట్టాన్ని రద్దు చేసి రైతులకు కొండంత భరోసా కల్పించారని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నామని, ఈ నెల 22న 'తల్లికి వందనం' పథకం కింద తల్లుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నట్లు తెలిపారు.

### రూ.770 కోట్లతో కోవూరు అభివృద్ధి

గత ప్రభుత్వం అస్తవ్యస్తం చేసిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని కూటమి ప్రభుత్వం గాడిలో పెడుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తోందని ఎమ్మెల్యే తెలిపారు. యువనేత నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యా రంగం, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో గ్రామీణాభివృద్ధి వేగంగా సాగుతోందన్నారు. వీరి సహకారంతోనే కేవలం రెండేళ్లలో కోవూరు నియోజకవర్గంలో సుమారు రూ.770 కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని చెప్పారు. అలాగే సీఎంఆర్ఎఫ్ ద్వారా కోవూరు నియోజకవర్గంలో దాదాపు వెయ్యి మందికి రూ.10 కోట్లకు చేరువైన ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు.

### షుగర్ ఫ్యాక్టరీ హామీ తప్పకుండా నెరవేరుస్తాం

ఎన్నికల సమయంలో ఇచ్చిన ఇనాం భూముల సమస్య పరిష్కారమైందని, రెండో ప్రధాన హామీ అయిన షుగర్ ఫ్యాక్టరీ అంశాన్ని కూడా ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులతో చర్చిస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమస్యను తాను ఏ రోజూ మర్చిపోలేదని, త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. అలాగే కొడవలూరులోని కిసాన్ సెజ్ ద్వారా దాదాపు రూ.15 వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయని, స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు.

### వీపీఆర్ నేత్ర సేవలను వినియోగించుకోవాలి

వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వీపీఆర్ నేత్ర సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. పోతిరెడ్డిపాళెంలో కార్యక్రమం పూర్తయిందని, ప్రస్తుతం చుండుగుంటలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు కూడా అందజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమం అనంతరం కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ని స్థానిక రైతులు గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జొన్నవాడ ఆలయ చైర్మన్ అశోక్ రెడ్డి, పెన్నా డెల్టా చైర్మన్ గోపిరెడ్డి, తెలుగుదేశం మండల అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, ఇంత మల్లారెడ్డి, మండల కార్యదర్శి నాగరాజు, వెంకటరమణారెడ్డి, తహసీల్దార్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యానికి భంగం కలగకుండా వ్యాపారాలు నిర్వహించేలా చూడాలి

## మటన్, చేపల మార్కెట్ మార్పునకు ఏకగ్రీవ నిర్ణయం - జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి (సింధూర దర్శిని) 17 జూలై తిరుపతి జిల్లా ; ప్రజారోగ్యానికి భంగం కలగించే వ్యాపారాలపై చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న మటన్, చేపల మార్కెట్లను మరొక చోట మార్చేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం మినీ మీటింగ్ హాల్ నందు నగరపాలక సంస్థ కమిషనర్ శారదా దేవి, తిరుపతి ఆర్డిఓ రామ్మోహన్, డిప్యూటీ కమిషనర్ ఎన్. అమరయ్య, అడిషనల్ ఎస్పి రవి మనోహరాచారి, డిప్యూటీ సిటీ ప్లానర్ దేవి కుమారి, హెల్త్ ఆఫీసర్ డా. యువ అన్వేష్, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, జిల్లా ఫుడ్ కంట్రోలర్ వేంకటేశ్వర రావు, ఏసీపీ పార్వతి ప్రియ, ఫిషరీస్ అధికారులు, తిరుపతి అర్బన్, రూరల్ తహశీల్దార్లు, తుడా విభాగాధిపతులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి నగరంలోని లీలా మహల్ వద్ద నగర నడిబొడ్డులో వున్న చేపల మార్కెట్ వలన ట్రాఫిక్ కు, చుట్టుపక్కల నివాస ప్రాంతాల వారికి ఇబ్బందికారంగా ఉందని ప్రజల నుండి ఎక్కువగా




పిర్యాధులు వస్తున్నాయని తెలిపారు. అలాగే పెద్దపీర్ల చావిడిలోని మటన్ మార్కెట్ నిర్వహణ వలన పరిసర ప్రాంతాల్లో నివాసం ఉన్న ప్రజలకు అనేకరకాల వ్యాధులు, దుర్వాసన, న్యూసెన్స్ కలుగుతున్నదని, ఆంత్రాక్స్ వంటి వ్యాధులు రావడానికి ఆస్కారమున్నదని పిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. కావున ప్రజలకు, వారి ఆరోగ్యానికి ఇబ్బందికరంగా ఉన్న మటన్ మార్కెట్ ను పెద్దపీర్ల చావిడి నుండి వైకుంఠపురం రోడ్డు పార్క్ వద్ద వున్న నగరపాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్ లోనికి, లీలమహల్ వద్ద వున్న చేపల మార్కెట్ ను ఎం ఆర్ పల్లె, న్యూ బాలాజీ కాలనీ లోని మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ లోనికి వెంటనే మార్చవలసినదిగా నిర్ణయించారు. అందుకు కావలసిన అన్ని ఏర్పాట్లు వెంటనే చేయవలసినదిగా సంబంధిత విభాగాల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అలాగే భక్తులకు, వాహన చోదకులకు ఇబ్బందికరంగా ఉండడంతో జూపార్క్ రోడ్డులో తొలగించిన వీధి వ్యాపారస్తులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అలిపిరి వద్ద జూపార్కు రోడ్డులో తొలగించబడిన షాపులను ఇస్కాన్ రోడ్డు నుండి చెన్నారెడ్డీ కాలనీలోకి వెళ్లే అభయ చరణారవింద భక్తి వేదాంత స్వామి ప్రభుపదుల మార్గం రోడ్డులోను, చింతలచేను వద్దగల కులశేఖర్ ఆల్వార్ వంద అడుగుల రోడ్డులలో వ్యాపారాలు ఏర్పాటు చేసుకునేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత వ్యాపారస్తులు ప్రజారోగ్యానికి భంగం కలుగకుండా తీసుకున్న చర్యలకు సహకరించి, వారి వ్యాపారాలు అధికారులు సూచించిన ప్రదేశాలలో పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలని వ్యాపారస్థులకు తెలిపారు.



# దివ్యాంగులకు అండగా వీపీఆర్ ఫౌండేషన్

**మరో ఇద్దరికి ఉచిత ట్రైసైకిళ్లు అందజేసిన వేమిరెడ్డి దంపతులు**

**నెల్లూరు జిల్లాలో ఇప్పటి వరకు 1,040 ట్రైసైకిళ్ల పంపిణీ**

నెల్లూరు (సింధూర దర్శిని) 17 జూలై నెల్లూరు జిల్లా ; నెల్లూరు జిల్లా వ్యాప్తంగా వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత ట్రైసైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతోంది. ఈ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు మరో ఇద్దరు దివ్యాంగులకు ఉచితంగా ట్రైసైకిళ్లను అందజేశారు. మధుమేహం (డయాబెటిస్) కారణంగా కాళ్లు కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఇద్దరు బాధితుల పరిస్థితిని తెలుసుకున్న వేమిరెడ్డి దంపతులు, వారి కదలికలకు ఆసరాగా ట్రైసైకిళ్లను పంపిణీ చేసి మరోసారి తమ సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. ట్రైసైకిళు అందుకున్న వారిలో కందుకూరు నియోజకవర్గం, ఉలవపాడు మండలం, రామాయపట్నం (రెడ్డిపాలెం) గ్రామానికి చెందిన పంతంగి శ్రీనివాసులు, అలాగే ఉదయగిరి నియోజకవర్గం, ఉదయగిరి టౌన్‌లోని మాదిగ పాలెంకు చెందిన నగిల్లా రామయ్య ఉన్నారు. ట్రైసైకిళ్లు అందుకున్న లబ్ధిదారులు తమకు అండగా నిలిచిన వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ రెండు ట్రైసైకిళ్లతో కలిపి వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,040 మంది దివ్యాంగులకు ఉచిత ట్రైసైకిళ్లను అందజేసి వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపారు.

# అభివృద్ధి పనులు సంక్షేమ పథకాల అమలు తీరుపై పర్యవేక్షణ

**కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ సంపత్ కుమార్**




నెల్లూరు( సింధూర దర్శిని) 17 జూలై నెల్లూరు జిల్లా ; కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ సంపత్ కుమార్ నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరు పర్యవేక్షణలో భాగంగా కమిషనర్ వై.ఓ నందన్ తో కలిసి స్థానిక పొదలకూరు రోడ్డు డైకాస్ రోడ్డు సమీపంలోని అన్నా క్యాంటీన్ ను శుక్రవారం సందర్శించారు. అన్నా క్యాంటీన్ లో ప్రజలకు అందుతున్న ఆహార నాణ్యతను వారు తనిఖీ చేశారు. క్యాంటీన్ కు విచ్చేసిన ప్రజలతో సి.డి. ఎమ్.ఎ, కమిషనర్ లు ప్రత్యక్షంగా మాట్లాడి ఆహార నాణ్యతను, నిర్వాహకుల వ్యవహార శైలిని అడిగి తెలుసుకున్నారు. క్యాంటీన్ ప్రాంగణంలో తాగునీటి వసతి, మరుగుదొడ్లు నిర్వహణ తీరును పరిశీలించారు. క్యాంటీన్ పరిసరాలలో పారిశుద్ధ్య నిర్వహణ తప్పనిసరిగా పాటిస్తూ నిర్దేశించిన ప్రమాణాలను క్యాంటీన్ నిర్వాహకులు చేపట్టాలని కమిషనర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర పాలక సంస్థ వివిధ విభాగాల అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నిత్య అన్నదానానికి విరాళం

**సహాయక కమిషనర్ అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి**

బుచ్చిరెడ్డిపాలెం (సింధూరదర్శిని) 17 జూలై నెల్లూరు జిల్లా; బుచ్చిరెడ్డిపాలెం జొన్నవాడ క్షేత్రంలో వెలసియున్న శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానంలో శుక్రవారం చినపడుగుపాడు వాస్తవ్యులు అట్లూరు బుజ్జి రెడ్డి అక్కమ్మ దంపతులు మరియు వారి కుటుంబ సభ్యులు శాశ్వత నిత్య అన్నదానమునకు రూ. 2,05,000/- విరాళం దేవస్థాన సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణ అధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి వారికి అందజేశారు. ఈ సందర్భంగా దాత గోత్రనామములతో శ్రీ మల్లికార్జున స్వామి వారికి శ్రీ కామాక్షితాయి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి శేష వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదములు, డొనేషన్ బాండ్ అందజేశారు.



# ఉపముఖ్యమంత్రి వర్యులు శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్‌ని కలిసిన ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి

మంగళగిరి జూలై 17 సింధూరదర్శిని: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ గత కొంత కాలంగా భుజం నొప్పితో బాధపడుతుండగా, 4 రోజుల క్రితం ముంబై లోని ఓ ప్రవేట్ హాస్పిటల్ లో శస్త్ర చికిత్స పొందడం జరిగింది. చికిత్స అనంతరం హైదరాబాద్ లోని ఆయన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు.

ఈ సందర్భంగా జనసేన పార్టీ సీనియర్ నాయకులు, ఆప్కో మాజీ చైర్మన్, మంగళగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ గంజి చిరంజీవి , పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని, దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధిగాంచిన మంగళగిరి మంగళాద్రి శ్రీ పానకాల లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానంలో ఎంతో విశిష్ట పొందిన మహా సుదర్శన హోమాన్ని కుటుంబ సమేత నిర్వహించారు. వేద మంత్రాల మధ్య జనకుల గోత్రోభవస్య, పవన్ కళ్యాణ్ నామదేశ్య అంటూ వేద పండితులతో మహా యాగాన్ని, పూజలు నిర్వహించడం జరిగింది.

పవన్ కళ్యాణ్ గారు త్వరగా కోలుకొని, ప్రజా పాలనలో పాల్గొనేలా ఆ లక్ష్మీ నరసింహ స్వామి వారి కరుణాకటాక్షాలు చూపించాలని కోరుతూ స్వామి వారి తీర్థ ప్రసాదాలు చిరంజీవి గారు పవన్ కళ్యాణ్ కి అందించారు.



# బాపట్ల జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా మారూటూరు రాఘవేంద్రరావు, కార్యదర్శిగా నాగవరపు పవన్ నియామకం



బాపట్ల సింధూరదర్శిని: ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా మరూటురు రాఘవేంద్రరావును నియమించారు. ఈ సందర్భంగా తనకు ఈ బాధ్యతలను అప్పగించిన ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ గౌరవాధ్యక్షుడు టీజీ వెంకటేష్, రాష్ట్ర అధ్యక్షుడు ఇల్లూరి లక్ష్మయ్యలకు రాఘవేంద్రరావు, పవన్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరావు మాట్లాడుతూ, బాపట్ల జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో అధ్యక్షులు, కార్యదర్శుల నియామక ప్రక్రియను త్వరలో పూర్తి చేసి, అనంతరం వివిధ సబ్ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆర్యవైశ్యుల సంక్షేమం, అభివృద్ధి కోసం సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. అలాగే, ఆర్యవైశ్యుల మనుగడకు అవసరమైన స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తామని, ఆర్థికంగా వెనుకబడిన ఆర్యవైశ్య కుటుంబాలకు అండగా నిలుస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్యులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఐక్యతతో ముందుకు సాగేందుకు కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఆర్యవైశ్య రాష్ట్ర రాజకీయ చైతన్య కమిటీ చైర్మన్ వెల్లంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ... ఆర్యవైశ్యులలో ఎన్ని గ్రూపులు ఎన్ని సంఘాలు ఉన్నా ప్రతి ఒక్కరు కూడా స్వచ్ఛంద సంస్థలకే సంబంధించిన వారేనని, మేము ఎల్లపుడు ఆర్యవైశ్యుల అభ్యున్నతికిపాటుపడుతున్నామని, పెద్దల సహాయ సహకారాలు ఉంటే రానున్న రోజు లలో ఆర్యవైశ్యులం దరినీ రాజకీయ చైతన్యవంతులుగా తయారు చేయడానికి మేము సిద్ధంగా ఉన్నామని, మా స్వచ్ఛంద సంస్థలకు మా సంఘాలకు మీరు కూడా సహాయ సహకారాలు అందించాలని ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు మారూటురి రాఘవేంద్రరావుకి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాగవరపు వెంకట, పవన్ కుమార్, వెల్లంపల్లి సత్యనారాయణ, కొల్లపూడి శివన్నారాయణ, బుర్లే అనిల్ కుమార్, జీవీ గుప్తా, ఊటుకూరి వెంకటేశ్వర్లు, బెల్లంకొండ పవిత్ర, గుండా శ్రీను, తటవర్తి గురుబ్రహ్మం తదితరులు పాల్గొని నూతన జిల్లా అధ్యక్షుడికి అభినందనలు తెలియజేశారు.

# వినియోగదారుల హక్కులు, చట్టాలపై అవగాహన అవసరం



కర్లపాలెం సింధూరదర్శిని: ప్రతి పౌరుడు వినియోగ దారుల హక్కులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ న్యాయమూర్తి శ్రీ సయ్యద్ జియావుద్దీన్ అన్నారు. కర్లపాలెం ఎంపీడీవో ఆఫీస్ ప్రాంగణంలో సచివాలయ సిబ్బందికి శుక్రవారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రతి పౌరుడు తమ హక్కులు చట్ట పరమైన రక్షణలపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనుకోని ప్రమాదాలు ఇతర న్యాయపరమైన సమస్యలు ఎదురైనప్పుడు పారా లీగల్ వాలంటీర్లను సంప్రదించాలన్నారు. ప్రతి కుటుంబం జనన, వివాహ తదితర కీలక ధ్రువపత్రాలను తప్పనిసరిగా పొందాలని సూచించారు.

న్యాయవాది కట్టా కాళిదాసు, సిహెచ్ రామాంజనేయులు, కట్టా శ్రీనివాసరావు, మండల డెవలప్మెంట్ ఆఫీసర్ ఏ. శ్రీనివాసరావు, తాసిల్దార్ రవీంద్రబాబు మరియు పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని ఉపకారగారమును ఆయన సందర్శించారు. రాజీ మార్గమే రాజమార్గం అని, లోక్ అదాలత్ తీర్పు అంతిమం అన్నారు. ఈ సందర్భంగా పలు చట్టాల గురించి వివరించారు.

## "మీ భూమి - మీ హక్కు రాజముద్రతో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ"



గురజాల సింధూరదర్శిని: పల్నాడు జిల్లా, గురజాల నియోజకవర్గం, మాచవరం మండలం, మల్లవోలు గ్రామం నందు రాష్ట్ర వ్యాప్తంగా గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "మీ భూమి - మీ హక్కు రాజముద్రతో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ" కార్యక్రమంలో భాగంగా అర్హత కలిగిన భూమి యజమానులకు ప్రభుత్వ రాజముద్రతో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ" కార్యక్రమంలో గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు గురజాల ఆర్.డి.వో మురళీకృష్ణ మాచవరం మండల తహసిల్దార్ నాగ మల్లేశ్వరరావు ఎంపీడీవో విష్ణు చిరంజీవి మాచవరం ఎంపీపీ కొక్కెర అంజమ్మ మరియు తదితరులు పాల్గొని అర్హత కలిగిన భూమి యాజమానులకు పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చెయ్యటం జరిగింది.



# అన్న క్యాంటీన్‌లో సామాన్యుడిలా భోజనం చేసిన మంత్రి

తెనాలి జూలై 17 సింధూరదర్శిని: ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించడమే లక్ష్యంగా రాష్ట్ర ఆహార, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శుక్రవారం తెనాలిలోని మార్కెట్‌యార్డు అన్న క్యాంటీన్‌ను సందర్శించారు. పట్టణంలో రోజంతా వివిధ వార్డుల్లో పర్యటించిన మంత్రి, మధ్యాహ్న భోజన విరామ సమయంలో నేరుగా క్యాంటీన్‌కు చేరుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి సామాన్యుడిలా భోజనం చేశారు. అనంతరం క్యాంటీన్‌లో అందిస్తున్న భోజనం నాణ్యత, రుచి, పరిశుభ్రత, నిర్వహణ విధానాన్ని స్వయంగా పరిశీలించారు. అక్కడ భోజనం చేస్తున్న లబ్ధిదారులతో మాట్లాడి ఆహారం నాణ్యత, సేవలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరికీ పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన భోజనం అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై మరింత విశ్వాసం కలిగేలా అన్న క్యాంటీన్ల నిర్వహణ ఉండాలని మంత్రి పేర్కొన్నారు.

# పారదర్శకతంగా అధ్యాపక పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టండి: మంత్రి లోకేష్



అమరావతి: రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల పరిధిలో ఫ్యాకల్టీ భర్తీ ప్రక్రియలో విశ్వవిద్యాలయాలు, వైస్ చాన్సలర్లు అత్యంత పారదర్శకంగా వ్యవహరించాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో ఉన్నత విద్య, స్కిల్ డెవలప్ మెంట్ శాఖల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్, లెక్చరర్ పోస్టుల భర్తీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలి, భర్తీ ప్రక్రియలో ఎటువంటి ఉల్లంఘనలు, ఆరోపణలు తలెత్తినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ యూనివర్సిటీల పరిధిలో అధ్యాపక పోస్టుల కోసం 1,90,509 అప్లికేషన్లు రాగా, వాటిలో 1,51,836 దరఖాస్తులు అర్హమైనవిగా నిర్ధారించినట్లు అధికారులు తెలిపారు. ఎలిజిబిలిటీకి సంబంధించి గ్రీవెన్స్ ను ఈనెల 21వతేదీ వరకు స్వీకరించి, 27వతేదీన అర్హుల తుదిజాబితా విడుదల చేస్తామని తెలిపారు. ఇంటర్వ్యూ ప్రక్రియను సైతం పూర్తి పారదర్శకంగా నిర్వహించేలా చూడాలి, ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయబోయే ప్రైవేటు యూనివర్సిటీల అనుమతులకు సంబంధించి విధివిధానాలు, వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి సెట్ల నిర్వహణ పురోగతిపై చర్చిస్తూ... సకాలంలో అడ్మిషన్లు పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రైవేటు వర్సిటీలకు అనుమతులు ఇచ్చే సమయంలో యుజిసి నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టంచేశారు.

**జాబ్ మేళాల ద్వారా 1.37లక్షలమందికి ఉద్యోగాలు**

స్కిల్ డెవలప్ మెంట్ శాఖపై మంత్రి సమీక్షిస్తూ... రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు నిర్వహించిన జాబ్ మేళాల ద్వారా 1.37లక్షల మంది యువతకు ఉద్యోగావకాశాలు లభించాయని తెలిపారు. యువతకు మరింత సౌలభ్యంగా ఉండేలా జాబ్ మేళాలను నిర్వహించాలని కోరారు. రాష్ట్రంలోని ప్రతి ఐటిఐని పరిశ్రమలకు అనుసంధానించి, యువత నైపుణ్యాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో కొత్తగా వచ్చే పరిశ్రమలకు అవసరమైన వర్క్ ఫోర్స్ తయారు, స్కిల్ గ్యాప్ భర్తీపై నిర్మాణాత్మక చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందుకు సంబంధించి 81 ఆపరేషనలైజ్ ఇండస్ట్రీ అకడమిషియా పార్టనర్ షిప్స్‌ను సిద్ధం చేశామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 23 జిల్లాకేంద్రాల్లో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్ స్ట్రక్షన్ ఆధ్వర్యాన రూ.94కోట్లతో ట్రైనింగ్ సెంటర్ల నిర్మాణానికి డిజైన్లు సిద్ధమైనట్లు అధికారులు తెలిపారు. నైపుణ్యం పోర్టల్ ను యువతకు ఉపయోగకరంగా తీర్చిదిద్ది, వచ్చేనెలలో ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. ఇంటర్మీడియట్ తర్వాత ఉన్నత విద్యకు వెళ్లే విద్యార్థులకు ఎన్ రోల్ మెంట్ ఆధారంగా మొదటి సంవత్సరం నుంచే వివిధ ఉద్యోగాలు, వాటికి కావాల్సిన స్కిల్స్ సమాచారం, కెరీర్ గైడెన్స్ వివరాలతో నైపుణ్యం పోర్టల్ ద్వారా అప్ డేట్స్ వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతి విద్యార్థికి స్కిల్స్ పై అవగాహన కల్పించడమేగాక ఆన్ లైన్ లో స్కిల్ పాస్ పోర్టు అందిస్తామని తెలిపారు. కళాశాల నుంచి చదువు పూర్తిచేసుకుని బయటకు వచ్చే ప్రతి విద్యార్థికి ప్లేస్ మెంట్ లభించేలా విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి చర్యలు చేపట్టాలి. రాష్ట్రంలో 169 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్లేస్ మెంట్ సెల్స్ ఏర్పాటుచేయాలని సూచించారు. ఫలితాల సాధనే అంతిమ లక్ష్యంగా అధికారులు పనిచేయాలని మంత్రి లోకేష్ ఆదేశించారు.

ఈ సమావేశంలో రాష్ట్ర ఉన్నత విద్య కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, స్కిల్ డెవలప్ మెంట్ సిఇఓ గణేష్ కుమార్, సీడాప్ సిఇఓ నారాయణస్వామి, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్. విజయభాస్కర్ పాల్గొన్నారు.



## టిటిడి ఆధ్వర్యంలో లక్ష్మీ అమ్మవారి కుంకుమార్చన

వేమూరు సింధూరదర్శిని: తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో చావలి వాలేశ్వరస్వామి దేవాలయం(శివాలయం)లో మంగళవారం నుండి శుక్రవారం వరకు జరిగిన ధార్మిక కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. సుమారు 250 మంది మహిళలతో ఘనంగా లక్ష్మీ అమ్మవారి కుంకుమార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టిటిడి ఉమ్మడి గుంటూరు జిల్లా శాఖ ప్రోగ్రాం ఆఫీసర్ ఇ.అమ్మడు మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి పూజించి సేవించటం వల్ల సకల శుభాలు కలుగుతాయని లక్ష్మీ అమ్మవారిని పూజించటం వల్ల సకల ఐశ్వర్య భోగభాగ్యాలు కలిగి శుభాలు కలుగుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, బూర్లె అరుణకుమారి, టీటీడీ ధార్మిక సేవా సభ్యులు పొన్నపల్లి సత్యనారాయణ, చవ్వాకుల శాంతకుమారి, గ్రామ పెద్దలు పట్టెల లక్ష్మీనారాయణ, సోమరౌతు లక్ష్మీధర్, వెంకటేశ్వరరావు, వెంకయ్య, విష్ణుమొలకల శ్రీరామకోటేశ్వరరావు, గుడిపల్లి వెంకటేశ్వర్లు, గోపాలం సాంబశివరావు, రామారావు, గాజుల సాయిరాం, తాడికొండ రఘురామయ్య, అర్చకులు చావలి మణికంఠ శర్మ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## సమస్య పరిష్కారం దిశ చూపుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్




బాపట్ల సింధూరదర్శిని: పి జి ఆర్ ఎస్ అర్జీల పరిష్కారంపై జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, దృష్టి సారించారు. కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ కమాండ్ కంట్రోల్ రూమ్ ను శుక్రవారం రాత్రి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిజిఆర్ఎస్ అర్జీలను క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ చెప్పారు. ఆన్ లైన్ లో నమోదైన అర్జీల వివరాలు ఆయన అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పాలు సూచనలు చేశారు. పరిష్కార మార్గం చూపారు. అర్జీదారులతో ఆయన స్వయంగా ఫోన్ చేసి మాట్లాడారు. నిజాంపట్నం మండలం పలపట్ల గ్రామానికి చెందిన బేతపూడి సీతారావమ్మ తన నివాస భూమి ఆక్రమణకు గురైందని అర్జీ పెట్టుకున్నారు. ఆమెతో ఫోన్ లోనే మాట్లాడారు. 9 సెంట్లు భూమి కి పూర్తిగా దస్త్రాలు ఉన్నప్పటికీ రాజకీయ పలుకుబడి ఉన్న వ్యక్తులు భూమిని ఆక్రమించి బెదిరిస్తున్నారని ఆమె కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ విషయంపై వీఆర్వో ను సంప్రదించి న్యాయం చేయాలని కోరినప్పటికీ ఫలితం లేకపోవడంతో పి జి ఆర్ ఎస్ లో విన్నవించినట్లు తెలిపారు. కొలతలు వేయాలని పలుసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ రాజకీయ ఒత్తిడితో భూమి కొలతలు వేయలేదని కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. తక్షణమే భూమి రికార్డుల శాఖ సహాయ సంచాలకులుతోను ఆయన నేరుగా మాట్లాడారు. ఆ భూమికి తక్షణమే కొలతలు వేసి ఆమెకు హక్కు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ ప్రక్రియ వెంటనే చేపట్టాలని ఆయన సూచించారు.

## ఆర్థిక సహాయం అందజేసిన తెదేపా నాయకులు

చెరుకుపల్లి. సింధూరదర్శిని: గూడవల్లి గౌడ పాలెంకు చెందిన రాయన నవీన్ కొన్ని రోజుల క్రితం యాక్సిడెంట్ జరిగింది. విషయం స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు ద్వారా తెలుసుకున్న రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ మరియు స్టాంపులు మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్ మరియు అనగాని శివప్రసాద్ బాధ్యుడి కుటుంబానికి 20 వేల రూపాయల ఆర్థిక సహాయం శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తాత ఏడుకొండలు రేపల్లె పొలిటికల్ మేనేజర్ పు షాడపు కుమారస్వామి కేసన రామకృష్ణ వీరంకి వెంకట శివ ఆలపాటి నరేంద్ర మల్లాది రామకృష్ణ వీరంకి సాంబశివరావు పాగోలు కోటేశ్వరావు రాయన కృష్ణారావు రాయన చంద్రమౌళి రాయల చంద్రయ్య అద్దంకి చంద్రశేఖర్ అద్దంకి భారతి మిద్దె మురళి మోర్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



# భవిత కేంద్రంలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లలలో మార్పు తీసుకు రావాలి





బాపట్ల సింధూరదర్శిని:

భవిత కేంద్రంలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లలలో మార్పు తీసుకు రావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్,వి.,తెలిపారు. రేపల్లె మున్సిపల్ పరిధిలో ఉన్న భవిత ప్రత్యేక అవసరాలు గల పిల్లల వనరుల కేంద్రాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భవితకేంద్రంలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లలలో మార్పు తీసుకురావడానికితల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం కలిసి పనిచేస్తే ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు మరింత మెరుగైన జీవితాన్ని అందించిన వాళ్ళం అవుతామన్నారు. భవిత కేంద్రాలకు ఏమేమి అవసరం ఉందో వంటి వివరాలను మరియు భవిత కేంద్రాల నిర్వహణకు సంబంధించి సలహాలు సూచనలు కూడా ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భవిత కేంద్రంలోని శిక్షణ పొందుతున్న మానసిక బుద్ధి మద్యం పిల్లల తల్లులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇక్కడ మీ పిల్లలకు అవసరమైన ఏర్పాట్లను బాగున్నాయని గతంలో మీ పిల్లలను ఎక్కడ ఉంచేవారని, ఈ భవిత కేంద్రం ద్వారా మీ పిల్లలకు అన్ని సౌకర్యాలు అందుతున్నాయని మీ పిల్లలు భవిష్యత్తు ఎలా ఉండాలని, మీరు కోరుకుంటున్నారని, తల్లుల ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కొందరు తమ పిల్లలు మానసిక స్థితి నుండి మామూలు చితికి వచ్చేలా ఇక్కడ విద్యాబుద్ధులు నేర్పించడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని, పిల్లలు వారి పనులు వారే చేసుకునే విధంగా శిక్షణ ఇస్తున్నారని, పిల్లలకు భద్రత కూడా కల్పిస్తున్నారని తెలిపారు. ఈ భవిత కేంద్రం పిల్లలకు చాలా ఉపయోగారంగా ఉందని వారు జిల్లా కలెక్టర్‌కి వివరించారు. భవిత కేంద్ర ఆవరణలో పిల్లలు అడుకోవడాని అవసరమైన పరికరాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి యం ఒ హెచ్ ఓ.డాక్టర్ ఎస్.విజయమ్మ ఆర్డీఓ.బి.శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు, తహశీల్దార్ శ్రీనివాసరావు ఉపాధ్యాయురాలు,పిల్లల తల్లులు తదితరులు ఉన్నారు.

# రైతుల భూసమస్యలకు పరిష్కారం చూపాలి: కలెక్టర్





బాపట్ల సింధూరదర్శిని: రైతులతో కలసి క్షేత్రస్థాయికి వెళ్లి భూ సమస్యల ను పరిశీలించి పరిష్కరం చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. శుక్రవారం రేపల్లె ఆర్డీఓ బి.శ్రీదేవి, తహశీల్దార్ శ్రీనివాస్‌తో ఆ కలసి ఆముదాలపల్లి గ్రామం వద్ద సర్వే నెం. 111 రైతులతో కలసి భూమిని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులతో కలసి క్షేత్రస్థాయికి వెళ్లి భూ సమస్యల ను పరిశీలించి పరిష్కరం చూపాలని వి ఆర్ ఓ ను ఆదేశించారు. ఆముదాలపల్లి గ్రామానికి చెందిన రైతు కన్నేటి చిన్న పోతురాజు కు చెందిన సర్వే నెం. 111 భూమిని పరిశీలించి రీ సర్వే చేయాలని విఆర్ ఓను ఆదేశించారు. అధికారులు రైతులతో మాట్లాడి వారి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకున్నారు. భూముల సరిహద్దులు, రికార్డులు, రీ సర్వే వివరాలను పరిశీలించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిబంధనల మేరకు పారదర్శకంగా చర్యలు చేపట్టాలని వి ఆర్ ఓ ను ఆదేశించారు. అనంతరం ఆముదాల పల్లి గ్రామ సచివాలయాని పరిశీలించి సిబ్బంది హాజరు పట్టికను సిబ్బంది నిర్వహిస్తున్న పలు రకాల రిజిస్ట్రార్లును పరిశీలించారు. గత నెల నుండి ఇప్పటి వరకు చేసిన సేవాల్యాసిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సమస్యల తో సచివాలయాని వచ్చే ప్రజలను సంతోషంగా పలకరిస్తూ వారు చెప్పే సమస్యలను విన్న తరువాత వారి సమస్య పరిష్కారం అవుతుంద లేదని విషయాన్ని వారికి తెలియజేయాలని సిబ్బందిని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట వి ఆర్ ఓ, నాగలక్ష్మి, రైతులు తదితరులు ఉన్నారు.



## అంతరిక్షంలోకి మోదీ చేతిరాత..

విక్రమ్‌-1 మిషన్‌లో 'వందేమాతర' సందేశం

విక్రమ్‌-1తో మోదీ పోస్టుకార్డు ప్రయాణం

'వందేమాతరం' మోదీ చేతిరాత సందేశం

జులై 18న విక్రమ్‌-1 ప్రయోగం - తొలి ప్రైవేటు ఆర్బిటల్ రాకెట్

'మిషన్ ఆగమన్'లో ప్రత్యేక జ్ఞాపికలు

శ్రీహరికోట నుంచి ప్రయోగం

భారత అంతరిక్ష ప్రయాణంలో మరో భావోద్వేగ క్షణం చోటు చేసుకోనుంది. ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా చేతితో రాసిన 'వందేమాతరం' సందేశం ఇప్పుడు అంతరిక్షంలోకి వెళ్లబోతోంది. హైదరాబాద్‌కు చెందిన ప్రైవేటు స్పేస్ స్టార్టప్ స్కైరూట్ ఏరోస్పేస్ రూపొందించిన విక్రమ్‌-1 టెస్ట్ ఫ్లైట్‌-1 మిషన్‌తో ఈ ప్రత్యేక పోస్టుకార్డు ప్రయాణించనుంది. రేపు ఈ ప్రయోగం జరగనుంది. స్కైరూట్ తెలిపిన వివరాల ప్రకారం.. మోదీ రాసిన పోస్టుకార్డుతో పాటు సంస్థ ఉద్యోగులు, పెట్టుబడిదారులు, విధాన నిర్ణేతలు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రేయోభిలాషులు చేతితో రాసిన సందేశాలను కూడా రాకెట్‌లో పంపనున్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమానికి 'మిషన్ ఆగమన్' అని పేరు పెట్టారు. భారత ప్రైవేటు అంతరిక్ష రంగానికి లభిస్తున్న మద్దతుకు ఇవి ప్రతీకగా నిలుస్తాయని సంస్థ వెల్లడించింది. స్కైరూట్ ఏరోస్పేస్ రూపొందించిన తొలి ఆర్బిటల్ లాంచ్ వెహికల్ విక్రమ్‌-1. దీని ద్వారా స్వదేశీ సాంకేతిక సామర్థ్యాన్ని నిరూపించడంతో పాటు వాణిజ్య అంతరిక్ష రంగంలో భారత్‌కు మరింత గుర్తింపు తీసుకురావాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. భారత భూభాగం నుంచి వెళ్లనున్న తొలి ప్రైవేటు ఆర్బిటల్ రాకెట్‌గా కూడా ఇది చరిత్ర సృష్టించనుంది. ఈ రాకెట్‌లో జ్ఞాపికలతో పాటు పలు సాంకేతిక ప్రదర్శన పేలోడ్‌లను కూడా పంపుతున్నారు. గ్రాహ స్పేస్, కాస్మోసర్ఫ్, డీక్యూబ్డ్, స్కైరూట్ రూపొందించిన స్కోప్ పేలోడ్‌లు ఇందులో ఉన్నాయి. అలాగే కాస్మిక్ బ్లూమ్ పేరుతో రూపొందించిన కళాఖండం, మైక్రో ఆర్ట్ పేలోడ్‌ను కూడా అంతరిక్షంలోకి తీసుకెళుతున్నారు. జులై 18న శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం తొలి ప్రయోగ వేదిక నుంచి విక్రమ్‌-1 ప్రయోగం జరగనుంది. ఈ ప్రయోగానికి అవసరమైన గగనతల, సముద్ర అనుమతులు ఇప్పటికే లభించినట్లు స్కైరూట్ వెల్లడించింది.

# కరిగిపోయే అద్భుతం.. చైనాలో కళ్లు చెదిరే మంచు నగరం!

చైనాలోని హార్బిన్ నగరంలో ఏటా రూపుదిద్దుకునే అద్భుత మంచు నగరం

గడ్డకట్టిన సోంగువా నది మంచుతో భారీ కోటలు, శిల్పాల నిర్మాణం

రెండు నెలల పాటు అలరించి, వసంతంలో కరిగిపోయే అశాశ్వత నిర్మాణాలు

ఈ అద్భుతాన్ని చూసేందుకు ఏటా పోటెత్తుతున్న లక్షలాది మంది పర్యాటకులు

శీతాకాలం ముగిశాక వేసవిలోనూ బీర్ ఫెస్టివల్ వంటి వేడుకలకు కేంద్రం



ప్రతి శీతాకాలంలో చైనాలో ఒక అద్భుతం ఆవిష్కృతమవుతుంది. గడ్డకట్టిన నది నుంచి వేల టన్నుల మంచును సేకరించి, దానితో కళ్లు చెదిరే కోటలు, రాజభవనాలు, శిల్పాలతో ఒక అద్భుత నగరాన్నే నిర్మిస్తారు. కేవలం రెండు నెలల పాటు పర్యాటకులను అలరించి, ఆ తర్వాత వసంతం రాగానే నెమ్మదిగా కరిగిపోయి, తిరిగి నదిలో కలిసిపోయే ఈ అశాశ్వత సౌందర్యమే హార్బిన్ అంతర్జాతీయ మంచు పండుగ ప్రత్యేకత. చైనాలోని ఈశాన్య రాష్ట్రమైన హీలాంగ్‌జియాంగ్ రాజధాని హార్బిన్‌లో ఈ అపురూప దృశ్యం రూపుదిద్దుకుంటుంది. ఇక్కడ శీతాకాలంలో ఉష్ణోగ్రతలు మైనస్ 20 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువకు పడిపోతాయి. ఈ తీవ్రమైన చలిని ఒక అవకాశంగా మార్చుకొని, గడ్డకట్టిన సోంగువా నది నుంచి భారీ మంచు దిమ్మలను కత్తిరించి, వాటితో ఈ మంచు ప్రపంచాన్ని సృష్టిస్తారు. వందలాది మంది కార్మికులు, కళాకారులు అత్యంత శీతల వాతావరణంలో పనిచేసి, అద్భుతమైన నిర్మాణాలకు జీవం పోస్తారు. సుమారు 10 లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ మంచు నగరం విస్తరించి ఉంటుంది. ఈ మంచు నగరంలోకి అడుగుపెడితే ఏదో అద్భుత లోకంలోకి ప్రవేశించిన అనుభూతి కలుగుతుంది. అనేక అంతస్తుల ఎత్తులో ఉండే మంచు కోటలు, మంచుతో చేసిన జంతువులు, ప్రపంచ ప్రసిద్ధ కట్టడాల నమూనాలు పర్యాటకులను అబ్బురపరుస్తాయి. ముఖ్యంగా రాత్రి సమయంలో రంగురంగుల ఎల్‌ఈడీ దీపాలతో ఈ నగరం మొత్తం వెలిగిపోతూ, మంత్రముగ్ధులను చేస్తుంది. సందర్శకులు మంచు స్లైడ్‌లపై జారవచ్చు, సొరంగాల్లో నడవొచ్చు, ఈ మంచు నిర్మాణాల మధ్య తిరుగుతూ మరపురాని అనుభూతిని పొందవచ్చు. ఈ మంచు నగరం ప్రత్యేకత దాని అశాశ్వతత్వంలోనే దాగి ఉంది. డిసెంబర్ చివరిలో లేదా జనవరి ప్రారంభంలో మొదలయ్యే ఈ ఉత్సవం, ఫిబ్రవరి చివరి నాటికి ముగుస్తుంది. కేవలం రెండు నెలలు మాత్రమే ఉనికిలో ఉండే ఈ సౌందర్యాన్ని చూసేందుకు ప్రపంచం నలుమూలల నుంచి లక్షలాది మంది పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు. దీంతో హార్బిన్ నగరానికి పర్యాటకంగా, ఆర్థికంగా భారీ ప్రోత్సాహం లభిస్తోంది. ఈ నగరంపై రష్యా ప్రభావం కూడా ఉండటంతో, ఇక్కడి సంస్కృతి, ఆహారం కూడా పర్యాటకులను ఆకట్టుకుంటాయి. ఈ ప్రదేశం కేవలం శీతాకాలంలోనే కాకుండా ఇతర సమయాల్లోనూ సందడిగా ఉంటుంది. ప్రస్తుతం ఇదే ప్రదేశంలో హార్బిన్ అంతర్జాతీయ బీర్ ఫెస్టివల్ వంటి వేసవి కార్యక్రమాలు జరుగుతున్నాయి. మానవ సృజనాత్మకతకు, ప్రకృతి చక్రానికి నిలువుటద్దంలా నిలిచే ఈ మంచు నగరం, ఎంత కష్టపడి నిర్మించినా చివరికి నదిలో కలిసిపోతుంది. మళ్లీ మరుసటి శీతాకాలంలో కొత్త రూపంలో పురుడుపోసుకుంటూ, పర్యాటకులకు ఓ మధురమైన జ్ఞాపకాన్ని పంచుతోంది.

# స్కూల్ వ్యాన్‌ను ఢీకొట్టిన రైలు.. ఇద్దరు విద్యార్థులు సహా ముగ్గురి మృతి

బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో ప్రమాదం - పలువురు విద్యార్థులకు గాయాలు

గేట్‌కీపర్ నిర్లక్ష్యంపై ఆరోపణలు - ఘటనా స్థలికి చేరుకున్న రైల్వే ఉన్నతాధికారులు



పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో శుక్రవారం ఉదయం చోటుచేసుకున్న ఘోర ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. విద్యార్థులతో వెళ్తున్న పాఠశాల వ్యాన్‌ను ప్యాసింజర్ రైలు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు చిన్నారులు సహా ముగ్గురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. బెర్హంపూర్ సమీపంలోని కర్ణసుబర్ణ రైల్వే క్రాసింగ్ వద్ద ఉదయం 7 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. విద్యార్థులను తీసుకెళ్తున్న వ్యాన్ రైల్వే ట్రాక్‌ను దాటుతుండగా, నిమ్తితా-కట్వా ప్యాసింజర్ రైలు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ధాటికి వ్యాన్ పూర్తిగా ధ్వంసమైంది. ప్రమాద తీవ్రతకు ఘటనాస్థలి అత్యంత హృదయవిదారకంగా మారింది. స్థానికులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. ప్రమాదం జరిగిన సమయంలో రైల్వే గేట్ తెరిచే ఉంది. సరిగ్గా అదే సమయంలో వ్యాన్ ట్రాక్‌పైకి చేరుకోగా, రైలు వస్తున్నప్పటికీ గేట్‌ను మూయలేదని వారు ఆరోపిస్తున్నారు. గేట్ సిబ్బంది నిర్లక్ష్యమే ఈ ఘోర ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదంలో గాయపడిన విద్యార్థులను వెంటనే ముర్షిదాబాద్ మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. అయితే, క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిపై అధికారులు ఇంకా ఎటువంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. ఈ ఘటనతో రైల్వే గేట్‌కీపర్ నిర్లక్ష్యంపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు, రైల్వే ఉన్నతాధికారులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గేట్‌కీపర్ అప్రమత్తతపై ఆరా తీయడంతో పాటు అన్నికోణాల్లోనూ సమగ్ర దర్యాప్తు ప్రారంభించారు.

# యుద్ధం కొనసాగుతున్నా.. భారత ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉంది: ఆర్‌బీఐ

పశ్చిమాసియా ఉద్రిక్తతలు, రుతుపవనాల ముప్పును ప్రస్తావించిన ఆర్‌బీఐ గవర్నర్

అయినా భారత ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని మల్హోత్రా ధీమా

రూపాయి పరిస్థితి సహజమేనని వివరణ

వాణిజ్య ఒప్పందాలు ఎగుమతులకు ఊతమిస్తాయని భరోసా

రిటైల్ ద్రవ్యోల్బణం 4 శాతం పరిధిలోనే ఉందని వెల్లడి



పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, బలహీన రుతుపవనాల ముప్పు ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ముందుకు సాగుతోందని చెప్పారు. అయితే అంతర్జాతీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం వేచి చూసే ధోరణిని అనుసరించాల్సిన అవసరం ఉందని సూచించారు. దూరదర్శన్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ యుద్ధం తర్వాత అమెరికా డాలర్ బలపడిందని మల్హోత్రా తెలిపారు. దీంతో అనేక దేశాల కరెన్సీలు బలహీనపడ్డాయని చెప్పారు. ప్రపంచ పరిస్థితులతో పోలిస్తే రూపాయి విలువలో వచ్చిన మార్పు సహజంగానే ఉందని స్పష్టం చేశారు. రూపాయి పనితీరుపై ఆందోళన అవసరం లేదని పేర్కొన్నారు. భారత విదేశీ వాణిజ్యం బలంగానే కొనసాగుతోందని ఆర్‌బీఐ గవర్నర్ వెల్లడించారు. సేవల ఎగుమతులు, విదేశాల్లో ఉన్న భారతీయుల నుంచి వచ్చే నగదు, రికార్డు స్థాయి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు దేశానికి అండగా నిలుస్తున్నాయని చెప్పారు. బ్రిటన్‌తో కుదిరిన వాణిజ్య ఒప్పందం, యూరోపియన్ యూనియన్, అమెరికాతో కొనసాగుతున్న చర్చలు కూడా ఎగుమతులకు ఊతమిస్తాయని వివరించారు. సరఫరా సంబంధిత కారణాల వల్లే ఇటీవల ద్రవ్యోల్బణం పెరిగిందని మల్హోత్రా తెలిపారు. ప్రస్తుతం రిటైల్ ద్రవ్యోల్బణం 4 శాతం పరిధిలోనే ఉందని చెప్పారు. ధరల స్థిరత్వంతో పాటు ఆర్థిక వృద్ధి మధ్య సమతుల్యం కాపాడే దిశగా ఆర్‌బీఐ చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. అందుకే ఈ ఏడాది ఇప్పటివరకు కీలక వడ్డీ రేటును 5.25 శాతం వద్దే కొనసాగించినట్లు పేర్కొన్నారు. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు మళ్లీ పెరుగుతున్నాయని మల్హోత్రా గుర్తుచేశారు. భారత్ తన అవసరాల్లో దాదాపు 88 శాతం ముడి చమురును దిగుమతి చేసుకుంటోందని చెప్పారు. చమురు ధరలు పెరిగితే ద్రవ్యోల్బణం, కరెంట్ అకౌంట్ లోటుపై ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ఆగస్టు 3 నుంచి 5 వరకు జరిగే ద్రవ్య విధాన కమిటీ సమావేశంలో తాజా ఆర్థిక పరిస్థితులను సమీక్షించి వడ్డీ రేట్లపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు.

# ప్రజలకు ఒకే రోజున రూ.3 వేల కోట్లను అందించాం: పయ్యావుల కేశవ్



అమరావతి, సింధూరదర్శిని:ప్రజలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ఒకే రోజున రూ.3 వేల కోట్లను కూటమి ప్రభుత్వం అందించిందని ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. నరసరావుపేటలో వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థను వైసీపీ అస్తవ్యస్తం చేసిందని విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఏ పని చేయాలన్నా ఖజానాలో డబ్బు లేని పరిస్థితి ఉండేదని అన్నారు. ప్రధాని మోదీ ఆశీస్సులు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆలోచనలతో ఏపీ ఇప్పుడు అభివృద్ధి దిశగా పరుగులు పెడుతోందన్నారు. ఒక మహిళ ఇంటిని ఎలా తీర్చిదిద్దుతుందో అంతకంటే మెరుగ్గా నిర్మలా సీతారామన్ పనిచేస్తున్నారని మంత్రి కొనియాడారు. '2024లో మీరు వేసిన ఒక్క ఓటు వల్లే ఏపీకి అమరావతి, పోలవరం, విశాఖ ఉక్కు, తల్లికి వందనం, ఉచిత బస్సు, గూగుల్ వంటి కంపెనీల రాక సాధ్యమైంది' అని చెప్పుకొచ్చారు. ఏపీకి ఏ కష్టం వచ్చినా నిర్మలా సీతారామన్ ఇంటి తలుపు తట్టి సాయం అడుగుతున్నామని, రాష్ట్రం కోసం ఏం అడిగినా కాదనకుండా కేంద్ర మంత్రి పనిచేస్తున్నారని తెలిపారు. విశాఖలో ఉక్కు పరిశ్రమ పరిరక్షణకు నిర్మలమ్మ చూపిన చొరవకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్డీయే ప్రభుత్వం రేయింబవళ్లూ రాష్ట్రం కోసం పనిచేస్తోందని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. మహిళలు, యువతకు భారీగా రుణాలు అందిస్తున్నామని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. మొదటిసారిగా ట్రాన్స్‌జెండర్లకు బ్యాంకు రుణాలు అందించామని తెలిపారు. అటవీ సాగుహక్కు పట్టాలు పొందిన గిరిజనులకు కూడా రుణాలు అందిస్తున్నామని చెప్పారు.

## జీవితంలో విజయం సాధించేందుకు శివుడు చెప్పిన రహస్యాలేంటో తెలుసా...!



ఈ లోకంలో ఉండే ప్రతి ఒక్క జీవి ఏదో ఒక సమయంలో కష్టాలను ఎదుర్కొంటారు. అది పని సంబంధించి కావచ్చు.. పరీక్షలలో ఫెయిల్ అవ్వడం.. ప్రేమలో విఫలమవ్వడం.. ఆర్థిక పరంగా.. ఆరోగ్య పరంగా.. కుటుంబ పరంగా.. సామాజిక పరంగా.. ఇలా ఏదో ఒక విషయంలో ఇబ్బందులను ఎదుర్కొంటారు.

అయితే ఎలాంటి పరిస్థితి ఎదురైనప్పటికీ.. మనం వాటన్నింటినీ అధిగమించి ముందుకు ఎలా వెళ్లాలి అనేది కేవలం మన చేతుల్లోనే ఉంటుంది. అయితే ఇలా జీవితంలో విజయం సాధించేందుకు అవసరమయ్యే రహస్యాలను ఆ పరమేశ్వరుడు వెల్లడించారు. అందరికీ ప్రేరణ కలిగించే ఆ దేవుని బోధనలు ఎంతో పవిత్రమైనవి.

పురాణాల ప్రకారం శివుడు.. తన భాగస్వామి అయిన పార్వతీదేవితో తరచుగా ఈ విషయాల గురించి ఎక్కువగా చర్చించేవారట. అందులో పార్వతీదేవికి శివుడు చెప్పిన రహస్యాలేంటో ఇప్పుడు మనం తెలుసుకుందాం. ఇవి మన జీవితంలో విజయం సాధించేందుకు ఎంతగానో ఉపయోగపడతాయి.

**మీ లక్ష్యం పట్ల..**

మనం చేసే ప్రతి పనిలో పట్టుదల మరియు సంకల్పం ఉన్నంతవరకు, మనం వాటిని మరింత మెరుగ్గా చేయగలం. ఏదైనా ప్రయత్నం బాగా జరగాలని మీరు కోరుకుంటే, మీరు మనస్సులో దృఢమైన నిబద్ధత కలిగి ఉండాలి. సంకల్పం తప్ప మరేది అవసరం లేదు.

**ఇతరులు ఏమనుకుంటున్నారో..**

సమాజం మీ గురించి కొన్ని మంచి లేదా చెడు విషయాలను కచ్చితంగా చెబుతుంది. అయితే సమాజంలోని కొందరు చెప్పే మంచి విషయాల వల్ల మీలో అహం పెరగొచ్చు. వారు చెప్పే చెడు విషయాలు మిమ్మల్ని ఇబ్బంది పెట్టొచ్చు. ఈ రెండూ మీ పతనానికి దారి తీస్తాయి. అందుకే ఇతరులు మీ గురించి ఏమనుకుంటున్నారో చూసి కలవరపడటం మానేయాలి. సమాజంలోని కొందరు మిమ్మల్ని పొగడ్తలతో ముంచెత్తినా.. వినయంగా ఉండాలి. వాటిని అతిగా నమ్మకండి. అప్పుడే మీ లక్ష్యాలపై మీరు ఎక్కువ శ్రద్ధ పెట్టగలరు.

**గురువుల పట్ల గౌరవం..**

మీకు గురువులతో ఉన్న సంబంధం మంచిది అయినా.. చెడ్డది అయినా, వారిపై ఎప్పుడూ మీరు గౌరవం కలిగి ఉండాలి. వారు మీకు నేర్పిన పాఠాలు పరీక్షల్లో రాకపోయినా.. జీవితంలో మాత్రం కచ్చితంగా ఉపయోగపడతాయి. వారి సహాయం మరియు మార్గ దర్శకత్వం వల్లనే మనం ముందుకు సాగే అవకాశం ఉంటుంది.

**బ్యాలెన్స్‌గా ఉండండి..**

ఒక గొప్ప యోగి మరియు తత్త్వవేత్త, శ్రీశ్రీ ఆనందమూర్తిజీ ఈ విషయాల గురించి ఇలా అన్నారు.'మీరు ఎలాంటి న్యూనత, ఆధిపత్యం లేదా ఓటమివాద సముదాయం లేదా నిస్సహాయత మరియు నిరాశ సంక్లిష్టతతో బాధపడకూడదు' మీ మనస్సు కంటే ఈ ప్రపంచంలో మంచి శక్తి మరొకటి లేదని మీరు మొదట అర్థం చేసుకోవాలి. ఏ ప్రత్యామ్నాయ ఆలోచన లేకుండా మీ మనస్సులో కనిపించిన చర్యను అమలు చేయడం ద్వారా, మీరు మీ జీవితాన్ని మరియు ప్రపంచాన్ని మార్చవచ్చు. కాబట్టి, ఇతరుల అభిప్రాయాల వల్ల మీ మనస్సు కలుషి తం కావడానికి అనుమతించవద్దు. మీరు ప్రపంచంలోనే అత్యుత్తమ వ్యక్తి అని మీరు మొదట నమ్మాలి. అలాగే, ఎప్పుడూ ఎక్కువగా ఆలోచించవద్దు. బ్యాలెన్స్‌గా ఉండేందుకు ప్రయత్నించండి.

**స్వీయ నియంత్రణ...**

మన సమాజంలో ఇతరులు ఏదో అన్నారని.. తమను తాము తక్కువ గా ఊహించుకుని బలహీనులుగా మారిపోతుంటారు. అదే సమ యంలో తమకు తెలిసిన వాటిని కూడా మరచిపోయి పొరపాట్లు చేయొచ్చు. కాబట్టి మీరు మిమ్మల్ని బలహీనపరిచే చర్యలను ఎప్పటికీ చేయకండి. ఏ పరిస్థితిలో అయినా ఆత్మవిశ్వాసంతో ఉండాలి. అలాగే ఆత్మనియంత్రణ ఉన్నవారు మాత్రమే ప్రతి ఒక్క దానిలో విజయం సాధిస్తారు.

**సరైన ఆహారం..**

మనం తీసుకునే ఆహారం సరైనదా కాదా అనేది ముందుగా తెలుసుకోవాలి. ఎల్లప్పుడూ ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినడానికి ప్రయత్నించండి. అనారోగ్యకరమైన ఆహారాన్ని ఎప్పుడూ తినకూడదు. మీ జీవిత లక్ష్యాన్ని సాధించడానికి, మీ శరీరానికి శక్తి అవసరం. కాబట్టి, మీరు ఆ శక్తిని పొందాలంటే, మీరు పోషకమైన ఆహారాన్ని తినాలి. శివుడు చెప్పిన ఈ జీవిత రహస్యాలు పాటిస్తే ప్రతి ఒక్కరూ జీవితంలో సులభంగా గెలవగలరు. మీరు ఈ రహస్యాన్ని ఎలా అర్థం చేసుకోవాలను కుంటున్నారనేది పూర్తిగా మీ ఇష్టం. మీరు ఈ రహస్యాలను మీ పడకగది గోడపై అతికించుకోవడం లేదా పుస్తకాల్లో రాసుకోవడం.. లేదా మొబైల్ నోట్ బుక్ లో రాసుకుని.. దీన్ని క్రమం తప్పకుండా చూడండి.. మీ జీవితంలో విజయానికి చేరుకునే దిశగా కచ్చితంగా పయనించొచ్చు.

## మీరు నల్లగా ఉన్నారా? ఇది త్వరలో తెల్లగా మార్చుతుంది?

# ఈ ఫేస్ ప్యాక్‌లను తరచుగా వాడండి

మీ ముఖం ముదురుగా మరియు నల్లగా మరియు అగ్లీగా కనిపిస్తుందా? మీరు త్వరలో తెల్లబడాలని అనుకుంటున్నారా? అప్పుడు మీ చర్మాన్ని క్రమం తప్పకుండా చూసుకోండి. మీకు పొడి చర్మం ఉందా? అలా అయితే ఈ రకమైన చర్మ సంరక్షణ వారి చర్మ సంరక్షణను ఇతర చర్మ రకాల కంటే కొంచెం ఎక్కువగా ఇవ్వాలి. పొడి చర్మం ఉన్నవారు పొడిబారిన చర్మాన్ని నివారించడానికి చర్మంలో తేమను నిలుపుకునే ఉత్పత్తులను ఎన్నుకోవాలి మరియు వాడాలి. లేకపోతే, చర్మంలో పొడి పెరుగుతుంది మరియు మీరు అధిక పొడి కారణంగా చర్మం దద్దుర్లు మరియు చర్మ దురద వంటి సమస్యలను ఎదుర్కోవలసి ఉంటుంది. మీరు పొడి చర్మం కలిగి ఉంటే మరియు త్వరగా తెల్లగా అనిపిస్తే, క్రింద ఇవ్వబడిన కొన్ని ఫేస్ మాస్క్‌లను తరచుగా వర్తించండి. అందువలన మీరు త్వరలో తెల్లగా మారుతారు.



**అరటి ఫేస్ ప్యాక్....**

ఈ ఫేస్ ప్యాక్ చేయడానికి, కరిగించిన అరటిని బాగా మాష్ చేసి, 2 టేబుల్ స్పూన్ల పెరుగు మరియు తేనెతో బాగా కలపండి. తరువాత మిశ్రమాన్ని ముఖం మరియు మెడపై వేసి 15 నిమిషాలు నానబెట్టండి, తరువాత చల్లటి



నీటితో కడగాలి.

**బొప్పాయి ఫేస్ ప్యాక్...**

మీరు తరచుగా బొప్పాయిని కొని తింటున్నారా? అప్పుడు మీరు దానితో ఫేస్ ప్యాక్ వేసుకోవచ్చు. దాని కోసం మీరు కొద్దిగా బొప్పాయిని మాష్ చేయాలి. తరువాత ముఖానికి అప్లై చేసి 15-20 నిమిషాలు నానబెట్టి, ఆపై మీ ముఖాన్ని గోరువెచ్చని నీటితో కడగాలి.

**పీచ్ ఫేస్ ప్యాక్...**

బొప్పాయి మాదిరిగా, పీచ్ ఫ్రూట్ స్కిన్ టోన్ యొక్క అందాన్ని పెంచుతుంది. దాని కోసం పీచు పండ్లను కత్తిరించి, దానిలో కొంత భాగాన్ని ముఖం మీద మెత్తగా రుద్దండి. 20 నిమిషాలు బాగా నానబెట్టి, తడిగా ఉన్న గుడ్డతో ముఖాన్ని తుడవండి. ఇది రోజూ చేస్తే, పొడి చర్మం తొలగించబడుతుంది మరియు చర్మం రంగు పెరుగుతుంది.

**అవోకాడో ఫేస్ ప్యాక్ ....**

అవోకాడో పండు పొడి చర్మానికి అనువైన అద్భుతమైన పండు. అవోకాడోను మెత్తగా మాష్ చేసి, ముఖం మరియు మెడపై రుద్దండి మరియు 1/2 గంటలు నానబెట్టండి, తరువాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోండి. త్వరగా, దానిని అనుసరించి, మీ ముఖాన్ని చల్లటి నీటితో కడగాలి.

**గోధుమ పిండి ప్యాక్ ....**

ఒక గిన్నెలో 2 టేబుల్ స్పూన్లు గోధుమ పిండి, 1 టేబుల్ స్పూన్ మిల్క్ క్రీమ్, అవసరమైన రోజ్ వాటర్ మరియు పేస్ట్ వేసి, ముఖం మరియు మెడ మీద అప్లై చేసి బాగా ఆరనివ్వండి. తర్వాత తడిగా ఉన్న వస్త్రంతో తుడవండి. ఇది పొడి చర్మాన్ని తొలగిస్తుంది మరియు చర్మాన్ని త్వరగా తెల్లగా చేస్తుంది.

**హనీ ఫేస్ ప్యాక్...**

ఒక గిన్నెలో 1 2/3 టేబుల్ స్పూన్ తేనె, ఒక గుడ్డు తెలుపు మరియు కొద్దిగా గ్లిసరిన్ కలపాలి. తరువాత కొద్దిగా గోధుమ పిండి వేసి పేస్ట్ తయారు చేసుకోండి. తరువాత ఈ మిశ్రమాన్ని ముఖం మరియు మెడపై వేసి 15 నిమిషాలు నానబెట్టి, చల్లటి నీటితో శుభ్రం చేసుకోండి. మీరు తరచూ ఫేస్ ప్యాక్ వేస్తే, చర్మం మృదువుగా మరియు సిల్కీ మెరిసేదిగా ఉంటుంది.


**ఉల్లిపాయ ఫేస్ ప్యాక్..**

సాధారణంగా ఉల్లిపాయ వాసన చాలా చెడ్డది. ఉల్లిపాయ రసం ముడుతలను నివారించగలదని మీకు తెలుసా? కొద్దిగా ఉల్లిపాయ రుబ్బి, రసం తీసుకొని, కొన్ని చుక్కల తేనెతో కలపండి, ముఖం మరియు మెడపై అప్లై చేసి 15 నిమిషాలు నానబెట్టండి, తరువాత చల్లటి నీటితో కడగాలి.



# మొత్తం గుడ్డు తినాలా లేదా గుడ్డులోని తెలుపు మాత్రమే తినాలా? ఈ రెండింటిలో ఏది మంచిది?

గుడ్లలో ప్రోటీన్ అధికంగా ఉంటుంది. కాబట్టి ఇది చాలా కాలం కడుపులో సంపూర్ణ భావనను ఇస్తుంది మరియు మిమ్మల్ని చురుకుగా ఉంచడానికి సహాయపడుతుంది. గుడ్లు శరీరంలో శక్తిని నిలుపుకోవడంలో సహాయపడతాయి. కానీ గుడ్డు ఎలా తినాలి - మొత్తం గుడ్డా లేదా గుడ్డులోని తెలుపు మాత్రమేనా? గుడ్డు చుట్టూ వివిధ నమ్మకాలు, అపోహలు మరియు వాస్తవాలు ఉన్నాయి. రోజూ మొత్తం గుడ్లు తినడం ద్వారా ఆరోగ్యం ప్రభావితమవుతుంది, కాబట్టి గుడ్డులోని పచ్చసొనను తొలగించి, తెల్లని పదార్థం మాత్రమే తినడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయని కొందరు నమ్ముతారు, మొత్తం గుడ్లు శారీరక ఆరోగ్యానికి మరింత అనుకూలంగా ఉంటాయని కొందరు నమ్ముతారు. కాబట్టి ఈ గందరగోళాన్ని పరిష్కరించడానికి ఈ పోస్ట్ మీకు సహాయపడుతుంది. పోషణ పరంగా మొత్తం గుడ్డు ఎలా మంచిది? మొత్తం గుడ్లలో గుడ్డు యొక్క తెలుపు కంటే ఎక్కువ పోషకాలు ఉంటాయి. వాటిలో విటమిన్లు ఎ, బి 6, బి 12, డి, ఇ, కె, కోలిన్ మరియు ఫోలేట్ ఉంటాయి. కాల్షియం, ఐరన్, పొటాషియం, మెగ్నీషియం, సోడియం మరియు సెలీనియం వంటి ఖనిజాలకు గుడ్లు మంచి మూలం. ఇది కాకుండా, గుడ్డులోని పచ్చసొనలో ఆరోగ్యకరమైన కొవ్వు మరియు మంచి కొలెస్ట్రాల్ ఉంటాయి. ఈ పోషకాలు తరచుగా గుడ్డులోని పచ్చసొనలో కనిపిస్తాయి. మహిళలు ఉన్నట్టుండి బరువు పెరగడానికి కారణాలేంటి ? మొత్తం గుడ్లలో పోషకాలు దీని నుండి మనం గుడ్డు మొత్తం గుడ్డులో లేని వివిధ పోషకాలను కలిగి ఉందని తెలుసుకోవచ్చు. మొత్తం గుడ్డులో 5 గ్రాముల ప్రోటీన్ మరియు 60 కేలరీలు ఉంటాయి. గుడ్డులోని పచ్చసొనలో ఒకే మొత్తంలో





ప్రోటీన్ కలిగి ఉంటుంది. కాని 20 కేలరీలు మాత్రమే కలిగి ఉంటుంది మరియు పూర్తిగా కొవ్వు రహితంగా ఉంటుంది. రొమ్ము క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది నార్త్ కరోలినా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఒక అధ్యయనంలో గుడ్డు మొత్తం తీసుకోవడం రొమ్ము క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుందని కనుగొంది. మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌ను నివారించడానికి గుడ్డులోని పచ్చసొనలోని కోలిన్ ఉత్తమమైన మార్గంగా గుర్తించబడింది. గుడ్డు పచ్చసొనలోని కెరోటినాయిడ్ కళ్ళకు మంచిది. కళ్ళ క్రింద నల్లగా వలయాలను నివారించడానికి ఇది మంచిది. పచ్చసొన తినడం లేదా ? ఐతే పోషకాలు కోల్పోయినట్టే తెల్లని సొనలో పోషకాలు బరువు తగ్గించే ప్రణాళికను అమలు చేస్తున్న వారు తక్కువ కేలరీలు తినడానికి మొత్తం గుడ్లు తినకుండా ఉండగలరు. గుడ్డులోని తెల్లసొనలో ప్రోటీన్, కాల్షియం, పొటాషి యం, సోడియం, మెగ్నీషియం, భాస్వరం ఉంటాయి. బరువు తగ్గడానికి ప్రయోజనకరమైనది ఎందుకంటే గుడ్డులో తెల్లని పదార్థం పూర్తిగా కొవ్వు లేకుండా ఉంటుంది. మీరు ఒక రోజులో మీకు కావలసినన్ని తెల్ల గుడ్లను తీసుకోవచ్చు. గుండె జబ్బులు మరియు డయాబెటిస్ ఉన్నవారు కూడా గుడ్డులోని తెల్ల పదార్థంను తీసుకోవచ్చు. రోజులో మీరు ఎన్ని గుడ్లు తీసుకోవాలి? గుడ్డు వినియోగం చెడు కొలెస్ట్రాల్ స్థాయిని పెంచుతుంది మరియు గుండె ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుందనే అపోహను చాలా మంది నమ్ముతారు. గుడ్లు తినడం ఆరోగ్యకరమైనదని, మితంగా తినడం వల్ల ఎటువంటి హాని లేదని వివిధ వైద్యులు ఇప్పటికీ పేర్కొన్నారు. గుడ్లు వండకుండా తెల్ల సొన తినకుండా ఉండటం చాలా ముఖ్యం. హార్ట్ ఫౌండేషన్ ఆఫ్ ఆస్ట్రేలియా మీరు వారానికి 8 మొత్తం గుడ్లు తీసుకోవచ్చని చెప్పారు. గుడ్డు తెల్లగా తీసుకోవటానికి ఒకే ప్రమాణం లేదు. మీకు నచ్చినంత ఎక్కువ తెల్లని పదార్థంను తీసుకోవచ్చు. సేంద్రీయ గుడ్లు మంచివి అయితే వివిధ రకాల గుడ్లు ఉన్నాయి. సేంద్రీయ గుడ్లు లేదా వండని కోడి గుడ్లు ఆరోగ్యంగా భావిస్తారు. బోనులలో పెంచిన కోళ్ళ నుండి పొందిన గుడ్ల కన్నా మొక్కలను స్వతంత్రంగా తినిపించే కోళ్ళు అధిక నాణ్యత కలిగినవిగా భావిస్తారు. గుడ్డు తీసుకోవడం గురించి మీరు అయోమయంలో ఉంటే, మీరు ధైర్యంగా సేంద్రీయ గుడ్లను కొనుగోలు చేయవచ్చు మరియు తినవచ్చు. ఈ గుడ్లు కేజ్డ్ గుడ్ల కన్నా కొంచెం ఖరీదైనవి అయినప్పటికీ, అవి ఆరోగ్యకరమైనవి. ముగింపు మొత్తం గుడ్డు మరియు గుడ్డులోని తెలుపు రెండూ మీ ఆరోగ్యానికి మంచివి. వాటి పోషక విలువలో తేడా మాత్రమే ఉంటుంది. మొత్తం గుడ్లలో విటమిన్లు మరియు ఖనిజాలు ఎక్కువగా ఉంటాయి. గుడ్డులోని తెల్లని పదార్థంలో తక్కువ కేలరీలు ఉంటాయి. బరువు తగ్గాలనుకునే వ్యక్తులు, కండరాల బలాన్ని పొందాలనుకునే వ్యక్తులు, వివిధ వైద్య పరిస్థితులు ఉన్నవారు గుడ్డులోని తెల్లని పదార్థం మాత్రమే తినవచ్చు. మరికొందరు రోజుకు ఒక గుడ్డు మొత్తం తీసుకోవచ్చు.




# సినిమా న్యూస్



ఐశ్వర్య మీనన్ సూర్యరశ్మిని అందిస్తోంది పూల్ సైడ్ ఐశ్వర్య మీనన్ దక్షిణ చిత్ర పరిశ్రమలోని ప్రముఖ నటీమణులలో ఒకరు, ఆమె అన్ని భాషలలో సినిమాలు చేసింది.

## ప్రభాస్ జంధ్యం వెనుక ఇంత కథ ఉందా?

ప్రభాస్ కొత్త సినిమా ఫౌజీ నుంచి విడుదలైన లేటెస్ట్ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీస్తోంది. పోస్టర్ లో ప్రభాస్ మెడలో జంధ్యం (యజ్ఞోపవీతం) ధరించి కనిపించడం అభిమానుల్లో ఆసక్తిని పెంచింది. సాధారణంగా యుద్ధభూమిలో గన్ పట్టుకున్న సైనికుడి లుక్ తోపాటు జంధ్యం కనిపించడం వెనుక ఏదైనా ప్రత్యేక కథ ఉందా అనే ప్రశ్నలు ఇప్పుడు వినిపిస్తున్నాయి. వీశీజఅవం ఇప్పటివరకు ప్రభాస్ కెరీర్ లో ఎన్నో విభిన్న పాత్రలు చేసినప్పటికీ, ఆదిపురుష్ లో రాజ వంశీయుడిగా మినహాయించి జంధ్యంతో కనిపించడం మాత్రం ఇదే తొలిసారి. దీంతో దర్శకుడు హను రాఘవపూడి హీరో రోల్ కు దేశభక్తి కథకు మించి మరో బ్యాక్ డ్రాప్ ను యాడ్ చేసినట్లు అభిమానులు అంచనా వేస్తున్నారు. అయితే సినిమా పోస్టర్లలో కనిపించిన కొన్ని హింట్స్ కూడా ఆ అనుమానాలకు బలం చేకూరుస్తున్నాయి. ముఖ్యంగా మహాభారతానికి సంబంధించిన శ్లోకాలు యూజ్ చేయడం, "అజ్ఞాత పర్వం ముగిసింది.. తిరుగుబాటు మొదలైంది" అనే ట్యాగ్ లైన్ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించాయి. మహాభారతంలో పాండవులు అజ్ఞాతవాసంలో తమ అసలు విషయాన్ని దాచుకున్నట్లు, ఫౌజీలో ప్రభాస్ పాత్ర కూడా ఏదో సీక్రెట్ టార్గెట్ గా ఉండే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. మరోవైపు కర్ణుడి కథతో కూడా ఆ రోల్ కు సంబంధం ఉండొచ్చని కొందరు భావిస్తున్నారు. పురాణాల ప్రకారం, కర్ణుడు అన్ని విద్యలను నేర్చుకునేందుకు తనను తాను వేరేగా పరిచయం చేసుకుంటాడు. అదే తరహాలో సినిమాలో ప్రభాస్ రోల్ కూడా తన అసలు పర్సనాలిటీ దాచి శత్రువుల మధ్యకు వెళ్లే మిషన్ లో భాగమవుతుందా అనే చర్చ నడుస్తోంది. అయితే దీనిపై మూవీ టీమ్ నుంచి ఎలాంటి అధికారిక సమాచారం లేదు. సినిమా కథ




1930-40ల కాలం నాటి నేపథ్యంలో సాగుతుందని ఇప్పటికే క్లారిటీ వచ్చింది. నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆజాద్ హింద్ ఫౌజ్ కాలాన్ని తలపించే ఎన్విరాన్మెంట్ ఇందులో కనిపించనుంది. ఒక సాధారణ కుటుంబానికి చెందిన వ్యక్తి దేశం కోసం పోరాట యోధుడిగా మారే ప్రయాణాన్ని దర్శకుడు చూపించే అవకాశం ఉందని సినీ ఎక్స్పర్ట్స్ చెబుతున్నారు. అందుకే జంధ్యం కేవలం ఒక ఆర్నమెంట్ లా కాకుండా, రోల్ బ్యాక్ డ్రాప్ ను, అతని ఆలోచనా ప్రపంచాన్ని సూచించే అంశంగా ఉండొచ్చని అభిప్రాయపడుతున్నారు. రీసెంట్ పోస్టర్ లో ప్రభాస్ రక్తపు మరకలతో, చుట్టూ మృతదేహాల మధ్య గన్ పట్టుకుని కూర్చున్న తీరు కూడా కథపై మరింత ఉత్కంఠ పెంచింది. ఒకవైపు ధర్మాన్ని సూచించే జంధ్యం, మరోవైపు యుద్ధాన్ని సూచించే తుపాకీ కనిపించడం పాత్రలోని డెప్త్ ను చూపిస్తోందని ఫ్యాన్స్ పోస్టులు పెడుతున్నారు.

ఇదిలా ఉంటే, మైత్రీ మూవీ మేకర్స్ సినిమాను డిసెంబర్ 3న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. అయితే పోస్టర్ తోనే ఇంత చర్చ జరుగుతుండటంతో, త్వరలో వచ్చే టీజర్ లో ప్రభాస్ జంధ్యం వెనుక ఉన్న అసలు కథపై మరిన్ని క్లూస్ దొరికే అవకాశం ఉందని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## క్లైమాక్స్ దశలో వారణాసి..



భారతీయ సినిమా గురించి ప్రపంచవ్యాప్తంగా డిస్కషన్ జరిగినప్పుడు తప్పకుండా వినిపించే పేర్లలో ఎస్.ఎస్. రాజమౌళి ఒకరు. అంతర్జాతీయ వేదికలపై వరుస గౌరవాలు అందుకుంటూనే, మరోవైపు తన కొత్త ప్రాజెక్ట్ వారణాసిని పూర్తి చేసే దిశగా ఆయన వేగంగా అడుగులేస్తున్నారు. విదేశాల్లో ప్రశంసలు అందుకున్న వెంటనే మళ్లీ షూటింగ్‌పై పూర్తి దృష్టి పెట్టడం రాజమౌళి పని తీరుకు మరో ఉదాహరణగా మారింది. ప్రస్తుతం వారణాసి ప్రొడక్షన్ కీలక దశలోకి చేరింది. షూటింగ్ లో ఎక్కువ భాగం పూర్తవడంతో, మిగిలిన షెడ్యూళ్లను వేగంగా పూర్తి చేసేలా మేకర్స్ ప్రణాళికలు సిద్ధం చేశారు. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్‌కు కూడా తగిన సమయం కేటాయించేలా షెడ్యూలింగ్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. భారీ స్థాయి విజువల్ ఎఫెక్ట్స్, ఇంటర్నేషనల్ రేంజ్ టెక్నికల్ వర్క్ ఈ సినిమాకు ప్రధాన బలంగా నిలవనున్న నేపథ్యంలో, షూటింగ్ పూర్తయ్యాక కూడా దీర్ఘకాలిక పోస్ట్ ప్రొడక్షన్ ప్రక్రియ కొనసాగే అవకాశం ఉంది. టార్గెట్ గా పెట్టుకున్న రిలీజ్ డేట్ కు ఎలాంటి ఆటంకం లేకుండా ప్రతి దశను ముందుగానే ప్లాన్ చేస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే సినీ వర్గాల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. వేలాది మంది జూనియర్ ఆర్టిస్టులతో రూపొందించనున్న భారీ యుద్ధ ఘట్టం ఈ షెడ్యూల్‌లో మెయిన్ ఎట్రాక్షన్ గా ఉండనుంది. భారతీయ సినిమాల్లో ఇప్పటివరకు తెరకెక్కిన అతిపెద్ద వార్ ఎపిసోడ్స్‌లో ఒకటిగా నిలిచేలా జక్కన్న దీన్ని రూపొందిస్తున్నారని సమాచారం. సెట్స్‌పై షూట్ చేసే ఈ సీన్ ను తరువాత అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్‌తో నెక్స్ట్ లెవెల్ కు తీసుకెళ్లే ప్రణాళిక కూడా ఉందని తెలుస్తోంది. రాజమౌళి సినిమాల భారీ కాన్వాస్‌ను ఈ ఎపిసోడ్ మరోసారి గుర్తు చేయబోతోందనే అంచనాలు ఈ వార్ ఎపిసోడ్‌పై ఉన్నాయి . ఇదిలా ఉండగా, ఫ్రాన్స్ పర్యటనలో రాజమౌళికి లభించిన గౌరవం భారతీయ సినీ పరిశ్రమకు మరో గుర్తింపుగా నిలిచింది. ఆయన సినిమాల స్పెషల్ స్క్రీనింగ్స్, సినీ స్టూడెంట్స్ మరియు ఆడియన్స్ తో నిర్వహించిన చిట్‌చాట్స్, మాస్టర్ క్లాసులకు వచ్చిన రెస్పాన్స్ ఇండియన్ స్టోరీలపై అంతర్జాతీయ ఆసక్తి ఎంతగా పెరిగిందో మరోసారి చూపించింది. తెలుగు భాషలో రూపొందిన సినిమాలు ప్రపంచవ్యాప్తంగా విశేష ఆదరణ పొందుతున్నాయనే విషయానికి ఇది బలమైన నిదర్శనంగా సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రతిష్టాత్మక వాల్ ఆఫ్ ఫిల్మ్‌మేకర్స్ లో రాజమౌళి పేరు చేరడం కూడా ఆయన సినీ ప్రయాణంలో మరో మైలురాయిగా నిలిచింది. ప్రపంచ సినీ రంగంలో విశిష్ట ముద్ర వేసిన డైరెక్టర్ల సరసన చోటు దక్కడం ద్వారా ఇండియన్ డైరెక్టర్ల ప్రతిష్ట మరింత పెరిగిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ సందర్భంగా బాహుబలి: ది ఎటర్నల్ వార్ కు సంబంధించిన తాజా వివరాలను కూడా రాజమౌళి పంచుకోవడం అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచింది. ఒకవైపు వారణాసిని ముగింపు దశకు తీసుకెళ్తూనే, మరోవైపు బాహుబలి వరల్డ్ ను విస్తరించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని స్పష్టమవుతోంది. దేశీయ మార్కెట్‌కే పరిమితం కాకుండా ప్రపంచ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని రూపొందుతున్న ఈ రెండు భారీ ప్రాజెక్టులు, భారతీయ సినిమా అంతర్జాతీయ స్థాయిని మరింత బలోపేతం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## కొడుకు కోసం సినిమాల ఎంపికను మార్చుకున్న కాజల్ అగర్వాల్!

పెళ్లి, మాతృత్వం తర్వాత కూడా సినీ ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్న కాజల్
తన కొడుకు గర్వపడే సినిమాలనే చేస్తానని వెల్లడి
సందేశాత్మక చిత్రాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నానన్న కాజల్



స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ పెళ్లి, మాతృత్వం తర్వాత కూడా తన సినీ ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగి స్తోంది. అయితే తల్లి అయిన తర్వాత సినిమాల ఎంపికలో తన ఆలోచనా విధానం పూర్తిగా మారిపోయిందని ఆమె తాజాగా వెల్లడించింది. ప్రస్తుతం 'ది ఇండియా స్టోరీ'తో పాటు ప్రతిష్ఠాత్మక పాన్ ఇండియా చిత్రం 'రామాయణ' షూటింగ్‌లతో బిజీగా ఉన్న కాజల్... తన కొడుకు నీల్ పెద్దయ్యాక తన సినిమాలు చూసి గర్వంగా చెప్పుకునేలా ఉండే స్క్రిప్ట్‌లను ఎంచుకుంటున్నట్లు తెలిపింది. కమర్షియల్ అంశాల కంటే బలమైన పాత్రలు, సందేశాత్మక చిత్రాలకే ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పింది.

చేతన్ డీకే దర్శకత్వంలో రూపొందుతున్న 'ది ఇండియా స్టోరీ'లో కాజల్ పవర్‌ఫుల్ లాయర్ పాత్రలో కనిపించనుది. శ్రేయస్ తల్పడే కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రం జూలై 24న విడుదల కానుంది. కల్తీ ఆహారం, పురుగుమందుల ప్రభావం నేపథ్యంలో సాగే ఈ కథ విన్నాక... ఒక తల్లిగా తన ఇంట్లో వాడే ఆహార పదార్థాల విషయంలో మరింత జాగ్రత్తలు తీసుకోవడం ప్రారంభించానని కాజల్ పేర్కొంది. మరోవైపు, నితేష్ తివారీ దర్శకత్వంలో రణబీర్ కపూర్, సాయిపల్లవి, యశ్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న 'రామాయణ'లో కాజల్ మండోదరి పాత్ర పోషిస్తోంది. తన కుమారుడు నీల్‌కు చిన్నప్పటి నుంచే రామాయణ కథలంటే ఇష్టమని, అయితే అతనికి శ్రీరాముడి కంటే రావణుడి పాత్రే ఎక్కువ ఇష్టమని నవ్వుతూ చెప్పింది. 'రామాయణ' రెండో భాగం విడుదలయ్యే సమయానికి నీల్‌కు ఐదేళ్లు వస్తాయని, థియేటర్‌లో వాడు చూసే మొదటి సినిమా ఇదే అవుతుందని కాజల్ ఆనందం వ్యక్తం చేసింది.

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662